అసత్యంతో సాధించిన
విజయం కంటే..
సత్యంతో సాధించిన
పరాజయమే మేలు
- మహాత్మా గాంధీ

Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 188 | ఆదివారం 28 డిసెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## ఎంజిఎన్ఆర్ఇజిఎ రద్దుకు వ్యతిరేకంగా
# 5 నుంచి దేశవ్యాప్త ఆందోళనలు

- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయం
- ఉపాధి హామీ పథకం రద్దు పేద ప్రజలపై దాడి అని అభివర్ణించిన రాహుల్ గాంధీ
- ఉపాధి హామీ పేదల పని హక్కు అని ఉద్ఘాటన
- కేంద్రం ఏకపక్ష నిర్ణయాలపై కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందని వ్యాఖ్య

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, డిసెంబర్ 27

గ్రామీణ ప్రజల జీవనోపాధిలో కీలక పాత్ర పోషించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ) రద్దుకు వ్యతిరేకంగా జనవరి 5 నుంచి కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించనుంది. ఈ మేరకు శనివారం నాడిక్కడ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం (ఇందిరా భవన్)లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో




ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ, తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రులు ఎ రేవంత్ రెడ్డి, సిద్ధా రామయ్య, సుఖ్‌వీందర్ సింగ్ సుఖ్, ప్రధాన కార్యదర్శులు కెసి వేణుగోపాల్, జైరాం రమేష్, సిడబ్ల్యుసి సభ్యులు పాల్గొన్నారు. కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపికి మద్దతుగా పని చేశారని విమర్శలు ఎదుర్కొంటున్న శశిథరూర్ కూడా ఈ సమావేశంలో పాల్గొనడం గమనార్హం. సమావేశం

- మిగతా 2లో..



## రాష్ట్రంలో 73 రైల్వే స్టేషన్ల
# సుందరీకరణ
### - వందే భారత్ రైలు ప్రారంభంలో మంత్రి సోమన్న

హిందూపురం - సూర్య వాస్తవం, డిసెంబర్ 27

అమృత్ పథకంలో భాగంగా రాష్ట్రంలో 73 రైల్వేస్టేషన్ల సుందరీకరణ చేసినట్లు కేంద్ర రైల్వే సహాయ శాఖ మంత్రి సోమన్న తెలిపారు. యశ్వంతపురం - కాచిగూడ మధ్య తిరిగే వందే భారత్ రైలును శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో స్టాపింగ్ ఇస్తూ

2లో

# నెల్లూరు జిల్లాలోనే గూడూరు..

- జిల్లాల పునర్విభజనపై సీఎం చంద్రబాబు సమీక్ష
- అభ్యంతరాలు, సూచనల స్వీకరణ తర్వాత స్వల్ప మార్పులు
- గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో కలపాలని నిర్ణయం
- డిసెంబర్ 31న తుది నోటిఫికేషన్ జారీకి సీఎం ఆదేశం
- పలు జిల్లాలు, డివిజన్ల సరిహద్దుల్లో కీలక మార్పులు చేర్పులు



హైదరాబాద్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 27

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని, కొన్ని స్వల్ప మార్పులతో ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. ఈ నెల 31వ తేదీన జిల్లాల పునర్విభజనపై తుది నోటిఫికేషన్ జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత నెల 27న రాష్ట్ర ప్రభుత్వం మూడు కొత్త జిల్లాలు, ఐదు కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో పాటు పలు మార్పులతో ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దీనిపై నెల రోజుల పాటు ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరించగా, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 927 అభ్యంతరాలు, సూచనలు అందాయి. ఈ నేపథ్యంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన ప్రభుత్వం, ప్రజాభీష్టానికి అనుగుణంగా కొన్ని ముఖ్యమైన మార్పులకు ఆమోదం తెలిపింది. ప్రజల నుంచి వచ్చిన తీవ్రమైన డిమాండ్‌ను గౌరవిస్తూ, గూడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలను తిరిగి నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇది ప్రభుత్వానికి ప్రజాభిప్రాయంపై ఉన్న గౌరవాన్ని సూచిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

- మిగతా 2లో..

అదేవిధంగా, అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి రెవెన్యూ డివిజన్ స్థానంలో అడ్డరోడ్డు జంక్షన్‌ను కొత్త రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మునగపాక మండలాన్ని అనకాపల్లి డివిజన్‌లో, అచ్యుతాపురం మండలాన్ని కొత్తగా ఏర్పడనున్న అడ్డరోడ్డు జంక్షన్ డివిజన్‌లో చేర్చనున్నారు. మార్కాపురం జిల్లా పరిధిలోకి దొనకొండ, కురిచేడు మండలాలను తీసుకు రావాలని సమావేశంలో నిర్ణయించారు. రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు కానున్న పోలవరం జిల్లా విషయంలో మాత్రం ఎలాంటి మార్పులు చేయకుండా, ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకారమే యధావిధిగా కొనసాగించాలని సీఎం సూచించారు. విస్తీర్ణంలో చాలా పెద్దదిగా ఉన్న ఆదోని పట్టణాన్ని రెండు మండలాలుగా విభజించాలనే ప్రతిపాదనపై

2లో



## మనువాద భావజాలాన్ని
# పెకిలించాలి

2లో

- శ్రామిక ఉత్సవ్ ప్రారంభిస్తూ ప్రముఖ సినీ నటుడు ప్రకాష్‌రాజ్
- సిఐటియు అఖిల భారత మహాసభ నేపథ్యంలో విశాఖలో ఘనంగా వేడుక

## పేద, అనాథ పిల్లలకుఅండగా
# నిలిచేందుకే ఎన్టీఆర్ ట్రస్ట్

- గండిపేటలో ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ వార్షికోత్సవం
- ఇక్కడికి వచ్చిన ప్రతిసారి నాకు ఆనందంగా ఉంటుంది
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు
- గండిపేటతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న వైనం
- సంస్థల నిర్వహణ ఘనత నారా భువనేశ్వరిదేనన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 27

పేద, అనాథ పిల్లలకు ఉన్నత విద్యను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే గొప్ప సంకల్పంతోనే ఎన్టీఆర్ ట్రస్ట్‌ను స్థాపించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.



సమాజ సేవలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సంస్థలు నేడు ఎంతో మంది విద్యార్థులకు అండగా నిలుస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్ గండిపేటలోని ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గండిపేటతో తనకున్న అనుబంధాన్ని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. "గండిపేటకు వచ్చినప్పుడల్లా నాకు చాలా ఆనందంగా ఉంటుంది. ఒకప్పుడు ఇదే ప్రాంగణంలో తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం ఉండేది. ఎంతో మంది రాజకీయ నాయకులకు ఇక్కడ శిక్షణ ఇచ్చాం. ఇప్పుడు అదే స్థలంలో వివిధ కారణాల వల్ల అనాథలుగా మారిన పిల్లలకు

- మిగతా 2లో..



## ఎన్టీఆర్‌కు మేమిచ్చే
# నివాళి ఇదే

- ఎన్టీఆర్ స్ఫూర్తితోనే ట్రస్ట్ సేవలందిస్తోందన్న భువనేశ్వరి
- పేదలు, అనాథలకు ఉచిత విద్య, మహిళలకు ఉపాధి కల్పిస్తున్నామని వెల్లడి
- హెల్త్ కేర్, సివిల్స్ అకాడెమీ ద్వారా యువతకు చేయూత
- ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా నిలుస్తున్నామని వివరణ
- ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నివాళి అని ఉద్ఘాటన

హైదరాబాద్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 27

తన తండ్రి దివంగత ఎన్టీ రామారావు స్ఫూర్తితో, ఆయన చూపిన బాటలోనే ఎన్టీఆర్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# ఎంజిఎన్ఆర్ఇజిఎ రద్దుకు వ్యతిరేకంగా

# 5 నుంచి దేశవ్యాప్త ఆందోళనలు

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లికార్జున్ ఖర్గే మాట్లాడారు. ఎంజిఎన్ఆర్ఇజిఎ రద్దుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, దాని పరిణామాలను మోడీ ప్రభుత్వం ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా 'ఎంజిఎన్ఆర్ఇజిఎ బచావో అభియాన్'ను నిర్వహిస్తామని అన్నారు. విబి–జి ఆర్ఎఎం జి చట్టంతో రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని, రాష్ట్రాలు, రాజకీయ పార్టీలతో ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు.. 2015లో భూ సేకరణ చట్టానికి చేసిన సవరణలను వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) తీవ్రమైన సమస్య అని, దేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేయడానికి మోడీ ప్రభుత్వం నిర్ణయించిన ప్రణాళికాబద్ధమైన కుట్ర అని విమర్శించారు. బిజెపి, ఎన్నికల కమిషన్ కలిసి పన్నిన కుట్ర అని ధ్వజమెత్తారు. అత్యంత వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనులు, మైనార్టీల పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించకుండా, ఇతర బూత్‌లకు బదిలీ చేయకూడదని సూచించారు. దీనికి కోసం బూత్ స్థాయి ఏజెంట్లు ఇంటింటికీ వెళ్లాలన్నారు. ఇడి, ఐటి, సిబిఐల దుర్వినియోగం జరుగుతోందని, నేషనల్ హెరాల్డ్ కేసులో న్యాయ పోరాటం కొనసాగుతోందన్నారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై జరుగుతున్న దాడులను ఆయన ఖండించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న సంస్థలు క్రిస్మస్ వేడుకలపై చేసిన దాడులు మత సామరస్యాన్ని దెబ్బతీశాయని, ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రతిష్టని దిగజార్చాయని విమర్శించారు.

**రాష్ట్రాలు, పేదలపై విధ్వంసకర దాడి**

మోడీ ప్రభుత్వం రాష్ట్రాలు, పేద ప్రజలపై నోట్ల రద్దు మాదిరిగానే విధ్వంసకర దాడికి పాల్పడిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రభుత్వ చర్యను కాంగ్రెస్ ప్రతిఘటిస్తుందని, ప్రతిపక్షాలు దీనికి మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. ప్రధాన మంత్రి తన మంత్రివర్గాన్ని సంప్రదించకుం డా, ఎటువంటి అధ్యయనం చేయకుండానే సొంతంగా ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే నిర్ణయాన్ని తీసుకున్నారని విమర్శించారు. దేశంలో పాలన వన్ మ్యాన్ షోగా మారిపోయిందనడానికి ఇదే ఉదాహరణ అని స్పష్టం చేశారు.

# పేద, అనాథ పిల్లలకుఅండగా

# నిలిచేందుకే ఎన్టీఆర్ ట్రస్ట్







(మొదటిపేజీ తరువాయి)

విద్యను అందిస్తుండటం సంతృప్తినిస్తోంది. సమాజంలో ఎవరూ అనాథలు కాకూడదనే ఉద్దేశంతో, వారికి పెద్ద దిక్కుగా నిలవాలనే లక్ష్యంతో అప్పుడు నాటిన చిన్న మొక్క ఇప్పుడు మహావృక్షంగా ఎదిగింది" అని ఆయన పేర్కొన్నారు.

ఎన్టీఆర్ విద్యా సంస్థలను ఉన్నత ప్రమాణాలతో, సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఘనత పూర్తిగా నారా భువనేశ్వరికే చెందుతుందని చంద్రబాబు ప్రశంసించారు. ఆమె పర్యవేక్షణ వల్లే సంస్థలు ఇంతగా అభివృద్ధి చెందాయని కొనియాడారు. ఈ సంస్థల నుంచి చదువుకున్న నలుగురు విద్యార్థులు గ్రూప్–1 పోస్టులకు ఎంపికయ్యారని, 29 మంది ప్రతిష్టాత్మక ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించారని తెలపడం గర్వంగా ఉందన్నారు. ప్రస్తుతం వివిధ కేంద్రాల్లో 1,641 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, చిన్న పాఠశాలగా మొదలైన ప్రస్థానం నేడు ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాల స్థాయికి విస్తరించిందని వివరించారు. గతంలో తన చొరవ వల్లే హైదరాబాద్ ఉన్నత విద్యకు, ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని చంద్రబాబు అన్నారు. హెరిటేజ్ సంస్థను స్థాపించినప్పుడు దాని బాధ్యతలు చేపట్టేందుకు భువనేశ్వరి మొదట అంగీకరించలేదని, కానీ ఆ తర్వాత ఎంతో సమర్థవంతంగా నిర్వహించారని





గుర్తుచేశారు. "గతంలో హైటెక్ సిటీ నిర్మించి ఐటీ రంగాన్ని ప్రోత్సహించాం. అదే స్ఫూర్తితో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌ను నెక్స్ట్ జెనరేషన్ టెక్నాలజీలకు చిరునామాగా మార్చబోతున్నాం. డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటమ్ వ్యాలీ, గ్రీన్ ఎనర్జీ, సెమీకండక్టర్ల తయారీ, డ్రోన్, స్పేస్ టెక్నాలజీలకు ఏపీని హబ్‌గా తీర్చిదిద్దుతాం" అని తన భవిష్యత్ ప్రణాళికను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# ఎన్టీఆర్‌కు మేమిచ్చే నివాళి ఇదే

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగిస్తోందని మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. 'మానవ సేవే మాధవ సేవ' అనే ఎన్టీఆర్ సిద్ధాంతానికి అనుగుణంగానే ట్రస్ట్ పనిచేస్తోందని ఆమె స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని గండిపేటలో జరిగిన ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు సమాజంలోని పేద వర్గాలకు అండగా నిలవడమే తమ లక్ష్యమని చెప్పారు. "పేద, అనాథ పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్నాం. సివిల్ సర్వీసెస్ అకాడెమీ ద్వారా యూపీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నాం. హెల్త్ కేర్, తలసేమియా సెంటర్, ఎన్టీఆర్ సంజీవని క్లినిక్కుల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నాం" అని వివరించారు. అంతేకాకుండా, 'స్త్రీశక్తి' ద్వారా పేద మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, 'ఎన్టీఆర్ సుజల' పథకం ద్వారా సురక్షిత తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామన్నారు. పేదల జీవితాలను మెరుగుపరచడం, కుటుంబాలను ఆదుకోవడమే ఎన్టీఆర్‌కు తామిచ్చే నిజమైన నివాళి అని భువనేశ్వరి పేర్కొన్నారు. బాహ్య ప్రపంచంలోని సవాళ్లను ఎదుర్కొనేందుకు విద్యార్థులు ఇక్కడి నుంచే సంసిద్ధులు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

# నెల్లూరు జిల్లాలోనే గూడూరు..

(మొదటిపేజీ తరువాయి)

కూడా సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. మరోవైపు, రైల్వే కోడూరును తిరుపతి జిల్లాలో, రాయచోటిని మదనపల్లి జిల్లాలో, రాజంపేట, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలను కడప జిల్లాలో కలపడంపై చర్చ జరిగినప్పటికీ, దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ప్రాథమిక నోటిఫికేషన్ మేరకు ఈ ప్రాంతాలు యథావిధిగానే...

- శ్రీకాకుళం జిల్లాలోని నందిగం మండలాన్ని పలాస డివిజన్ నుంచి టెక్కలి డివిజన్‌కు మార్చడం
- అనకాపల్లి జిల్లాలోని చీడికాడ మండలాన్ని నర్సీపట్నం డివిజన్ నుంచి అనకాపల్లి డివిజన్‌కు మార్చడం.
- కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దాపురం డివిజన్‌కు మార్చడం
- అద్దంకి రెవెన్యూ డివిజన్‌లోని అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె. పంగులూరు, కొరిసపాడును ప్రకాశం జిల్లాలోకి మార్పు చేయడం
- కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని మర్రిపూడి, పొన్నలూరు మండలాల్ని కందుకూరు రెవెన్యూ డివిజన్‌లోకి మార్పు... ప్రకాశం జిల్లాలో విలీనం
- కందుకూరు డివిజన్‌లోని 5 మండలాలను ప్రకాశం జిల్లాకు మార్చడంతో పాటు... కందుకూరు డివిజన్‌లోని మిగిలిన రెండు మండలాలు అయిన వరికుంటపాడు, కొండాపురం మండలాలను కావలి డివిజన్‌లోకి మార్పు...
- పలమనేరు డివిజన్‌లోని బంగారుపాలెం మండలాన్ని చిత్తూరు డివిజన్‌కు మార్పు
- చిత్తూరు జిల్లా పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని చౌడేపల్లి, పుంగనూరును మదనపల్లి రెవెన్యూ డివిజన్‌కు మార్చడం
- చిత్తూరు జిల్లా పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని సదుం, సోమలను మదనపల్లి జిల్లాలోని పీలేరు రెవెన్యూ డివిజన్‌కు మార్పు
- శ్రీ సత్యసాయి జిల్లాలో కొత్తగా మడకశిర రెవెన్యూ డివిజన్ ఏర్పాటు
- కదిరి రెవెన్యూ డివిజన్‌లోని ఆమడగూరు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం
- పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లోని గోరంట్ల మండలాన్ని పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో చేర్చాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ మార్పుచేర్పుల తర్వాత ఈ డిసెంబర్ 31న తుది నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయనుంది. సమీక్షా సమావేశంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, అనిత, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో 73 రైల్వే స్టేషన్ల

# సుందరీకరణ

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. శనివారం హిందూపురం రైల్వేస్టేషన్‌లో స్థానిక ఎంపి పార్థసారథితో కలిసి మంత్రి జెండా ఊపి రైలును ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో యుపిఎ ప్రభుత్వం ఉన్న సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రూ.886 కోట్లు రైల్వే నిధులు మంజూరు చేశారన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.9470 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,560 కిలోమీటర్ల నూతన రైల్వే మార్గాల నిర్మాణం, 717 ఆర్ఒబిలు, ఆర్‌యుబిల నిర్మాణం పూర్తి అయినట్లు తెలిపారు. తిరుపతి, నెల్లూరు, విశాఖపట్నం, రాజమండ్రి వంటి ప్రధాన స్టేషన్లతో పాటు హిందూపురం, పుట్టపర్తి రైల్వేస్టేషన్లకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, హిందూపురం రైల్వే స్టేషన్ సుందరీకరణ కోసం ఇప్పటికే రూ.23 కోట్లు మంజూరు చేశామని, 2026 జూన్ నాటికి సుందరీకరణ పనులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు.

# మనువాద భావజాలాన్ని పెకిలించాలి

**- శ్రామిక ఉత్సవ్ ప్రారంభిస్తూ ప్రముఖ సినీ నటుడు ప్రకాష్‌రాజ్**
**- సిఐటియు అఖిల భారత మహాసభ నేపథ్యంలో విశాఖలో ఘనంగా వేడుక**

**గ్రేటర్ విశాఖ – సూర్య వాస్తవం, డిసెంబర్ 27**

పాలకులు దేశంలో మనువాదాన్ని అమలు చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, ఆ భావజాలాన్ని కూకటి వేళ్లతో పెకిలించాలని ప్రముఖ సినీ నటుడు ప్రకాష్ రాజ్ అన్నారు. సమస్యలపై శ్రామిక జనం గొంతెత్తి పోరాడాలని పిలుపునిచ్చారు. విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి నాలుగు వరకూ జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభను పురస్కరించుకుని బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్ వెనుక ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శనివారం నుంచి తలపెట్టిన శ్రామిక ఉత్సవ్ ఘనంగా ఆరంభమైంది. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్ అధ్యక్షత వహించిన ఈ ప్రారంభ వేడుకకు ముఖ్య అతిథిగా ప్రకాష్ రాజ్ హాజరయ్యారు. ఆయనతోపాటు వేదికపైగల అతిథులంతా కలిసి శ్రామికవర్గ సంస్కృతికి దర్పణం పట్టేలా యుద్ధ భేరిని డ్రమ్స్ కొట్టి ప్రారంభించారు. ప్రకాష్ రాజ్ 'లాల్ సలాం.. జై భీమ్' అని అభివాదం చేస్తూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తన మాటలతో సభికుల్లో ఉత్సాహం, ఉత్తేజం నింపారు. అంతా 'లాల్ సలామ్.. జై భీమ్' అనడంతో సభా ప్రాంగణం ఒక్కసారిగా హోరెత్తింది. సిఐటియుకు, తనకూగల బంధం ఈనాటిది కాదని, తన చిన్నప్పటి నుంచీ ఉందని ప్రకాష్ రాజ్ తెలిపారు. 18 ఏళ్ల వయసులోనే వీధి నాటికలు వేస్తూ శ్రమజీవుల చైతన్యం కోసం ఊరూరా తాను తిరిగానని వివరించారు. ఈ వేదికపై కళాకారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు చూస్తే తన చిన్ననాటి వీధి నాటికల గురుతులు కళ్లముందు మెదిలాడుతున్నాయన్నారు.

గతంలో శ్రామికుల గురించి%ొ% చెమట చుక్కకు ఓటమి లేదు అనేవారని, నేడు ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాల కారణంగా శ్రామికులకు బతికే పరిస్థితి లేదని ప్రకాష్ రాజ్ పేర్కొన్నారు. దేశంలో కార్పొరేట్లను పెంచడం వల్లే ఈ స్థితి నెలకొందన్నారు. సంస్కృతి పరిస్థితి చూస్తే.. భారతదేశం సరోవరం అయితే అందులో కనిపించే కమలం బిజెపి కాగా, దాని వేర్లు ఆర్ఎస్ఎస్ అని తెలిపారు. బిజెపిపై పోరాడటమే కాకుండా వేళ్లూనుకుని ఉన్న ఆర్ఎస్ఎస్‌పైనా పోరాడాలని పిలుపునిచ్చారు. విశాఖ వచ్చాక ఇక్కడ పోరాడేవారిపై ప్రభుత్వ నిర్బంధం గురించి విన్నానని తెలిపారు. బంధించినప్పటికీ హక్కుల కోసం కార్మికుల గొంతు వినిపిస్తూ ఉంటుందన్నారు. తాను సినీ యాక్టర్‌ని అయినా కార్మిక గొంతే వినిపిస్తానని స్పష్టం చేశారు. ప్రవాహంలో కొట్టుకుపోయే చేపల్లా కాకుండా ఎదురీదే చేపలా పోరాడుతానన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు గఫూర్ మాట్లాడుతూ రాజ్యాంగానికి కట్టుబడి ఉన్న సెక్యులరిస్ట్ ప్రకాష్ రాజ్ అని కొనియాడారు.

శ్రమ అవార్డును ప్రకాష్‌రాజ్ నుంచి ప్రముఖ శ్రామిక కవి తెలకపల్లి రవి ఈ వేదికపై స్వీకరించారు. వేదికపై సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, లీడర్ పత్రిక సంపాదకులు వివి.రమణమూర్తి, ఫిల్మ్ మేకర్ సత్యానంద్, ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న, సిఐటియు నాయకులు కందారపు మురళి, బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, శ్రామిక ఉత్సవ్ కన్వీనర్ కె.రమాప్రభ ఉన్నారు.

# పేదలకు సంజీవిని సిఎం రిలీఫ్ ఫండ్

**- టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర**



**వేంపల్లె – సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** సిఎం రిలీఫ్ ఫండ్ నిధులు పేదలకు సంజీవిని లాంటిదని టిడిపి వేంపల్లె మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర అన్నారు. శనివారం ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి బిటెక్ రవి చేతుల మీదుగా లబ్ధిదారునికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్ర మాట్లాడుతూ పేదల ఆరోగ్య శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం కింద నిధులు మంజూరు చేస్తోందన్నారు. ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఎలాంటి ఆపద సంభవించిన నేనున్నాను అనే ధైర్యాన్ని నింపుతూ అండగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్యం, బద్రతలపై కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అభిప్రాయపడ్డారు.

# సంపాదకీయం

## టాలీవుడ్‌లో డ్రెస్సింగ్ వార్

సినిమా ఇండస్ట్రీ అన్నాక వివాదాలు కొత్తేమీ కాదు. కానీ, ఇద్దరు పాపులర్ సెలబ్రిటీల మధ్య మాటల యుద్ధం జరిగితే అది సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతుంది. రీసెంట్‌గా టాలీవుడ్ సీనియర్ హీరో, బిగ్ బాస్ ఫేమ్ శివాజీ మరియు స్టార్ యాంకర్ అనసూయ భరద్వాజ్ మధ్య జరిగిన వివాదం టాలీవుడ్‌లో హాట్ టాపిక్ అయింది.మహిళలు, హీరోయిన్ల డ్రెస్సింగ్ గురించి శివాజీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. శివాజీని కొందరు సమర్థిస్తే, కొందరు విమర్శించారు. శివాజీకి అనసూయ కూడా కౌంటర్ ఇచ్చారు. తాను చేసిన వ్యాఖ్యలపై దీనికి ఆయన వివరణ కూడా ఇచ్చుకున్నారు. అయితే ఇది ఇంతటితో ఆగలేదు. తాజాగా అనసూయ మరో సంచలన ట్వీట్ చేసింది.'కొంతమంది పురుషులు.. ఇంకా కొంతమంది మహిళలు కూడా.. నా వయసును ఉపయోగించి నన్ను తక్కువగా చూపించ డానికి.. నన్ను చిన్నగా భావింపజేయడానికి ప్రయత్నిస్తున్నారు.. ఈ విధమైన ఆలోచన కలిగిన వారు ఎక్కువగా ప్రగతిశీల మహిళలను లక్ష్యంగా చేసుకుంటారు.. ఇది మహిళలపై నియంత్రణ కోల్పోతామన్న భయం వల్ల.. అలాగే బలహీనమైన పితృస్వామ్య అహంకారాన్ని పోషించుకోవాలనే ఉద్దేశంతో జరుగుతుంది. ఇది అందరి పురుషుల గురించీ లేదా అందరి మహిళల గురించీ కాదు. కానీ నేను పురుషులు.. మహిళలు.. అందరికీ విన్నపం చేస్తున్నాను.. దయచేసి విస్తృతంగా ఆలోచించండి. పాత తరాలు నేర్చుకున్నవి లేదా అలవాటుపడ్డ ఆలోచనలు మనం తప్పనిసరిగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం లేదు.మనం మార్పును ఎంచుకోవచ్చు. మన హీరోయిన్లు వేసుకొనే బట్టలు చూస్తే మనకే దరిద్రమనిపిస్తుంటుంది. హీరోయిన్లు ఏమనుకొన్నా పర్వాలేదు. మీ అందం నిండుగా కట్టుకొనే చీరలో.. నిండుగా కప్పుకొనే దుస్తుల్లోనే ఉంటుంది తప్పితే.. సామాన్లు కనపించే దుస్తుల్లో ఉండదు. మీరు అర్ధనగ్నంగా కనిపించే దుస్తులు వేసుకొన్నప్పుడు చాలా మంది మీ ముందు నవ్వుతారు. కానీ మనసులో దరిద్రపు ముండ ఇలాంటి బట్టలు ఎందుకు వేసుకొంటారు? కొంచెం మంచి బట్టలు వేసుకొంటే బాగుంటుంది కదా అని లోపల అనాలనిపిస్తుంది. ఆ మాటలు బయటకు అనలేం. స్త్రీ అంటే ప్రకృతి.. ఎంత అందంగా ఉంటే.. అంత గౌరవం పెరుగుతుంది. ప్రకృతి మాదిరిగానే మా అమ్మ సావిత్రి, సౌందర్య మాదిరిగా చక్కగా కనిపిస్తుంటుంది. గ్లామర్ ఒక దశ వరకే ఉండాలి. కానీ హద్దు మీరి ఉండకూడదు. స్వేచ్ఛ అనేది అదృష్టం. మనం వేష, భాషల వల్లే గౌరవం, స్వేచ్ఛ లభిస్తుంది. చీరకట్టు మహిళలకే విశ్వసుందరి అవార్డులు లభించాయి అని శివాజీ అన్నారు.మన గౌరవాన్ని.. మన స్వేచ్ఛను కాపాడుకోవచ్చు.. ఒకరికొకరం శక్తినివ్వాలి.. మద్దతుగా నిలవాలి.. మన విలువ మన ఎంపికల నుంచే వస్తుంది.. మరే దానితో కాదు. అంతేకాకుండా కొంతమంది మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.. మీ పని బాధ్యతతో చేయాలి.. ఈ విధమైన మహిమాపరచడం సమంజసం కాదు, అభినందనీయం కాదు.అలాగే.. జరుగుతున్న ప్రతిదానితో సంబంధం లేకుండా.. నేను ఎల్లప్పుడూ అండగా నిలుస్తాను.. బాధపడకుండా.. ప్రభావితం కాకుండా.. తాకబడకుండా.. మరియు బలంగా.. ఈ మొత్తం సంభాషణ చాలా కాలంగా వినబడని మరియు నిర్లక్ష్యం చేయబడిన సమాజంలోని ఒక వర్గాన్ని సూచించడం గురించి మాత్రమే..చివరికి నేను ఎల్లప్పుడూ అలాగే జీవిస్తాను, చెబుతాను. ఇంకొక్కటి లాస్ట్ చెప్తా ఈరోజుకి.. ఉన్న ఇష్యూ నీ అడ్రస్ చేయటం చేతగాక నా గురించి, వయసు గురించి ప్రస్తావించడం సిగ్గు చేటు. ఆంటీ అంటున్న మగవాళ్ళు, ఆడవాళ్ళు..ఆయన్ని మాత్రమే గారు అంటున్నరు.. నాకు 40, ఆయనకు 54 అనుకుంటా. పర్సనల్ గా నో ఫిట్‌నెస్ ని "గ్లామర్" ని మెయింటెయిన్ చేస్తున్నాం.. ఈ అనేవాళ్ళందరూ నిత్య యవ్వనులు అది వేరే విషయం అనుకోండి. సర్లెండి.. ఇంకా ఇంతకంటే ఏం చెప్పిన చెవిటోడి ముందు శంఖం ఊడినట్టే.. మెర్రీ క్రిస్మస్!! ఇది మరొక రోజు.. మంచి ఆహారం తీసుకోండి.. మన ప్రియమైన వారితో సంతోషకరమైన సమయాన్ని గడపండి" అని రాసుకొచ్చింది అనసూయ. మరో ఇంద్రజ మాట్లాడుతూ.. "నా బాడీ నా ఇష్టం. నాకు నచ్చిన డ్రెస్ నేను వేసుకున్నాను.. నువ్వు ఎందుకు అడుగుతున్నావు అని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. కానీ నీ ఇష్టం అని పబ్లిక్ గా బట్టలు వేసుకుని రావడం.. జనాల మధ్యలో.. మీడియాలో నీ ఫోటోస్, వీడియోస్ పెట్టడం నీకు ఎంత హక్కు ఉందని నువ్వు అంటున్నావో.. న డ్రెస్సింగ్ అభ్యంతకరంగా.. చీప్ గా ఉన్నప్పుడు దాని గురించి అడిగే హక్కు కూడా ఎదుటివారికి ఉంటుంది. పబ్లిక్ లో ఇలా ఉండాలని ఒకటి ఉంటుంది. ఇంట్లో ఉన్నట్లు.. ఇంట్లో మాట్లాడినట్లు బయట ఉంటాను అంటే కుదరదు. పబ్లిక్ లో ఎలా ఉండాలి అనేది ఒక కోడ్ ఉంటుంది. అది నీ ఇష్టం నేను వేసుకుంటాను అంటే.. ఓకే కానీ.. వేసుకున్నాక కామెంట్స్ చేయొద్దు అనే రైట్స్ మాత్రం నీకు లేవు" అని అన్నారు"అసభ్యకరమైన బట్టలు మీ పబ్లిక్ లో కాదు.. మీ పర్సనల్ ప్లేస్ లో వేసుకోండి.. పబ్లిక్ లో వేస్తే అలాగే కామెంట్స్ చేస్తారు. అన్నింటినీ భరిస్తేనే బయట అలాండి డ్రెస్సింగ్ వేసుకోండి. లేదంటే వేసుకోవద్దు. కొందరి డ్రెస్సింగ్ చూస్తే ఇవేమి డ్రెస్సులు అనిపిస్తుంది. అలాంటి కాస్ట్యూమ్స్ తో ఎలా కంఫర్ట్ గా ఉంటారు అనిపిస్తుంది. అందంగా ఉండాలి.. ట్రెండింగ్ గా ఉండాలి. కానీ ఛీ అనేలా ఉండకూడదు. సెలబ్రిటీలు ఈ విషయంలో స్ట్రిక్ట్ గా ఉండాలి. మిమ్మల్ని చూసి ఫాలో అయ్యేవాళ్ళు ఉన్నారు కాబట్టి. మనల్ని ట్రీట్ చేసే విధానం బట్టల్లో కూడా ఉంటుంది "అని అన్నారు.

# ఆదోని పీపీపీ మిస్టరీ...




**కర్నూలు – సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్వహణను పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో అప్పగించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం ఇప్పుడు అనూహ్య మలుపు తిరిగింది. ఒకవైపు ప్రతిపక్ష వైసీపీ హెచ్చరికలు, మరోవైపు ఇన్వెస్టర్ల నిరాసక్తి నడుమ మెడికల్ కాలేజీలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ వ్యవహారంలో తాజాగా కిమ్స్ పేరిట జరిగిన ప్రచారం, ఆపై వచ్చిన ఖండన గందరగోళానికి దారితీసింది. ఆదోని మెడికల్ కాలేజీకి దాఖలైన ఏకైక టెండరు చుట్టూ ఇప్పుడు అంతుచిక్కని ప్రశ్నలు ముసురుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పీపీపీ విధానంలో నిర్వహణకు ప్రభుత్వం ఆహ్వానించిన టెండర్లలో, కర్నూలు జిల్లా ఆదోని మెడికల్ కాలేజీకి మాత్రమే స్పందన లభించింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్య సంస్థ కిమ్స్ ఈ బిడ్‌ను దాఖలు చేసిందని మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మిగిలిన మూడు కాలేజీలైన మార్కాపురం, మదనపల్లె, పాడేరులకు ఎవరూ ముందుకు రాకపోవడంతో, కనీసం ఒక్క కాలేజీకైనా ప్రముఖ సంస్థ ఆసక్తి చూపించిందని ప్రభుత్వం ఊపిరి పీల్చుకుంది.కానీ, ఈ వ్యవహారంలో ఒక షాకింగ్ ట్విస్ట్ చోటుచేసుకుంది. స్టాక్ మార్కెట్‌లో లిస్టయిన, డాక్టర్ భాస్కరరావు నేతృత్వంలోని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రుల చె?న్ కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఈ వార్తలను ఖండించింది. ఆదోని మెడికల్ కాలేజీ టెండరుతో తమకు ఎలాంటి సంబంధం లేదని, తాము బిడ్ దాఖలు చేయలేదని సంస్థ స్పష్టమైన ప్రకటన విడుదల చేసింది. తమది లిస్టెడ్ కంపెనీ అని, ఏదైనా నిర్ణయం తీసుకుంటే స్టాక్ ఎక్స్ఛేంజీలకు అధికారికంగా తెలియజేస్తామని వెల్లడించింది.హైదరాబాద్ కిమ్స్ సంస్థ ప్రకటనతో ఇప్పుడు కొత్త సందేహాలు మొదలయ్యాయి. ఆదోని కాలేజీకి టెండర్ వేసింది ఎవరు? ఒకవేళ పేరులో సారూప్యత ఉన్న వేరే ఏదైనా చిన్న సంస్థ టెండర్ వేసిందా? లేక ప్రభుత్వ వర్గాలే కిమ్స్ పేరును తెరపైకి తెచ్చాయా? అనే చర్చ ఇప్పుడు వైద్య వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఒకవేళ చిన్న సంస్థ టెండర్ వేసి ఉంటే, దానికి మెడికల్ కాలేజీని నిర్వహించే ఆర్థిక, సాంకేతిక సామర్థ్యం ఉందా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.ఈ మొత్తం ఎపిసోడ్‌ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తమ రాజకీయ విజయంగా అభివర్ణిస్తోంది. నాలుగు కాలేజీలకు గాను మూడింటికి అసలు టెండర్లే రాకపోవడం, వచ్చిన ఒక్కటి కూడా వివాదాస్పదం కావడానికి తమ అధినేత వైఎస్ జగన్ చేసిన హెచ్చరికలే కారణమని ఆ పార్టీ నేతలు విశ్లేషిస్తున్నారు. "ప్రభుత్వం మారితే పీపీపీ ఒప్పందాలను రద్దు చేస్తాం, ఆస్తులను స్వాధీనం చేసుకుంటాం" అని జగన్ గతంలో ఇన్వెస్టర్లను గట్టిగా హెచ్చరించారు.ఈ హెచ్చరికల నేపథ్యంలోనే బడా కార్పొరేట్ సంస్థలు వెనకడుగు వేశాయని, వేల కోట్ల పెట్టుబడి పెట్టి రేపు ప్రభుత్వం మారితే ఇబ్బందులు ఎదుర్కోవడం ఎందుకన్న ఉద్దేశంతోనే టెండర్లకు దూరంగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కేవలం నిర్వహణ బాధ్యతలను మాత్రమే ఇస్తామని చెబుతున్నా, భవిష్యత్తులో వచ్చే చిక్కులను దృష్టిలో ఉంచుకుని ఇన్వెస్టర్లు వెయిట్ అండ్ సీ ధోరణిని అవలంబిస్తున్నారు.మరోవైపు, టెండర్ల ప్రక్రియ ఆశించిన స్థాయిలో లేకపోయినా, పీపీపీ విధానంపై వెనక్కు తగ్గేది లేదని ఏపీ ప్రభుత్వం సంకేతాలు ఇస్తోంది. గుజరాత్ మోడల్‌ను అధ్యయనం చేసిన అనంతరం, మెడికల్ కాలేజీల నిర్వహణ భారం ప్రభుత్వంపై పడకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతోంది. దీనికి తోడు, కేంద్ర ప్రభుత్వం కూడా పీపీపీ ప్రాజెక్టులకు అండగా నిలుస్తోంది. ఇటీవల కేంద్రం పీపీపీ ప్రాజెక్టులకు దీర్ఘకాలిక రుణ సహాయం అందించేందుకు సుముఖత వ్యక్తం చేయడంతో, ఏపీ సర్కార్ మరింత ఉత్సాహంగా ఉంది. కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక వెసులుబాటుతో మరిన్ని ప్రాజెక్టులను ఇదే బాటలో నడిపించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అయితే, ప్రస్తుత టెండర్ల వైఫల్యం ప్రభుత్వానికి ఒక హెచ్చరికలా మారింది.మొత్తానికి ఏపీ మెడికల్ కాలేజీల పీపీపీ వ్యవహారం ఇప్పట్లో కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. ఆదోని టెండర్ వేసిన అసలు సంస్థ ఎవరనేది బయటకు వస్తే గానీ ఈ మిస్టరీ వీడదు. మరోవైపు, మిగిలిన కాలేజీల కోసం ప్రభుత్వం నిబంధనలు సడలించి మళ్లీ టెండర్లు పిలుస్తుందా? లేక ప్రతిపక్షాల డిమాండ్ మేరకు ప్రభుత్వమే సొంతంగా నిర్వహిస్తుందా? అనేది వేచి చూడాలి. ఏది ఏమైనా, పేదలకు అందాల్సిన వైద్యం, విద్యార్థులకు అందాల్సిన విద్య ఈ రాజకీయ, వాణిజ్య చదరంగంలో నలిగిపోకూడదన్నదే సామాన్యుడి ఆకాంక్ష.

# ఆమె చావుకు కారణం ఎవరో..?





**మదనపల్లె – సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** మదనపల్లి జిల్లా ఆసుపత్రిలో హృదయ విదారక ఘటన జరిగింది. చికిత్సకు వచ్చి ఆస్పత్రిలో ఆరు బయటనే పడుకున్న మహిళ చలిలో తన ప్రాణం పోగొట్టు కుంది. శనివారం జిల్లా ఆస్పత్రిలో వెలుగు చూసిన ఈ విషాదకర ఘటనకు కారకు లెవరు..? ఈ పాపం ఎవరిది..? తంబళ్లపల్లి మండలం, బలక వారిపల్లికి చెందిన రాగిణి వెంకటప్ప భార్య మల్లమ్మ ఆరోగ్యం బాగలేక శుక్రవారం ఆస్పత్రికి చికిత్సకు వచ్చింది. తాత్కాలిక వైద్యం పొందినట్లు చేతికి క్యాన్ల కలిగి ఉంది. ఆస్పత్రి ఆరు బయట స్లాబు కింద పడుకొని రాత్రంతా చలికి తట్టుకోలేక చనిపోయింది. శనివారం ఉదయం ఆస్పత్రి సిబ్బంది చనిపోయిన మహిళను గుర్తించారు. వెంటనే అత్యవసర విభాగంలోనికి తీసుకువచ్చి డాక్టర్లు పరీక్షించగా చనిపోయిందని నిర్ధారించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇంత దారుణ ఘటన జరిగడానికి ఆసుపత్రి ఉన్నతాధికా రులు, కొందరి ఉద్యోగులే కారణమని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వాసుపత్రి తమ సొంత జాగిర్ల భావించి కొందరు రోగులను ఆసుపత్రి లోపల పడుకోవడానికి అనుమతించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దానికి తోడు రాత్రంతా చలిలో ఆరు బయట పడుకోవడం వల్ల ఆమె ప్రాణాలు పోగొట్టుకుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కొందరి సిబ్బంది ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్న తీరుపై ఆసుపత్రి సూపరింటెంట్, ఆర్ ఎమ్ఓ ల దృష్టికి తీసుకెళ్లి రోగుల పట్ల కనికరం లేకుండా కఠినంగా వ్యవహరించడమే మల్లమ్మ మృతికి కారణమని ఆరోపిస్తున్నారు. కాగా పాకెట్లో పైసా లేని పేదోళ్లు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారిని సిబ్బంది పిచ్చోళ్ల ను చూసినట్లు చూస్తున్నారు. ఎంతో కొంత వైద్యం ఇవ్వచ్చు. లేకుంటే రెండు మందుబిళ్ళలు ఇచ్చి తగ్గిపోతుంది పో అంటే ఆ రోగులు కాస్త ఊరట చెందుతారు. అయితే మదనపల్లె జిల్లా ప్రభుత్వం ఆస్పత్రి ఇందుకు భిన్నంగా ఉంది. కొందరు సిబ్బంది ఆస్పత్రి తన సొంతం లా ప్రవర్తిస్తున్నారు. ఒంటరిగా ఆస్పత్రికి వస్తే తోడు లేకుంటే అడ్మిట్ చేసుకోమని వెనక్కి పంపేస్తున్న సంఘటనలు జిల్లా ఆస్పత్రిలో జరుగురున్నాయి. ఆ కారణం చేతనే తంబళ్లపల్లె నుంచి మదనపల్లి జిల్లా ఆస్పత్రిలో వైద్యం పొందడానికి శుక్రవారం వచ్చిన మల్లమ్మ చనిపోయి ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకొని కారణంగా ఆరుబయట చలిలో పడుకుని అన్యాయంగా తన ప్రాణాలను పోగొట్టుకుందని అభిప్రాయపడు తున్నారు... ఉన్నతాధికారుల పట్టింపు లేని తనమే రోగులపాలిట శాపంగా మారిందని పలువురు అధికారుల తీరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### గంగమ్మ దేవాలయంలో వేలంపాట ద్వారా
# రూ. 28,49,000 ఆదాయం



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** వచ్చే ఏడాది 2026 ఫిబ్రవరి 17 18 19 తేదీల్లో జరగబోవు గంగమ్మ జాతర సంబంధించి తలనీలాలు కొబ్బరికాయలు సంబంధించి 28 లక్షల 49,000 ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక గంగమ్మ దేవాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా పూజ సామాగ్రి 7,00,000 జాతర తలనీలాలు 1,90,000 విడిదినాల తలనిలాలు 65000 విడి దినాలు కొబ్బరికాయలు 7,92,000 విడి దినాలు షామియానా 5,12,000 వేలంపాట నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మిగిలిన టోల్ గేటు మిగిలిన విడిదినాలకు సంబంధించి వేలంపాట వాయిదా పడినట్లు ఆయన తెలిపారు.గత ఏడాది కన్నా ఈ ఏడాది నాలుగు లక్షల రూపాయలు ఆదాయం పెరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లి టిడిపి ఇన్చార్జ్ యనమల మదన్మోహన్, కొండూరు వెంకటరామరాజు కమిటీ సభ్యులు అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

### ఒకరోజు ముందే ఎన్టీఆర్ భరోసా
# భద్రత పించన్లు పంపిణీ



**పామిడి– సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 2025 నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు డిసెంబర్ 31, నాడేపంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో ఏం తేజోష్ణ శనివారం ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, మండల వ్యాప్తంగా జనవరి ఒకటి బదులు ఈనెల డిసెంబర్ 31 తేదీనే ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత ఫించన్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు నూతన సంవత్సరాన్ని పెన్షన్ల లబ్ధిదారులు ఆనందంగా గడపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ఉక్కుం జారీ చేయడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు డిసెంబర్ 31వ తారీఖున జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ప్రకారం లబ్ధిదారులకు ఉదయం 6,00 గంటల నుంచి 7.00 గంటల లోపు సచివాలయ సిబ్బంది, పంపిణీ అధికారులు లబ్ధిదారుల ఇంటికి వద్దకు వెళ్లి 100శాతం పెన్షన్లు పంపిణీ చేస్తారన్నారు. సంబంధిత ఫంక్షన్ పంపిణీ అధికారులకు ఎంపీడీవో తేజోష్ణ ఆదేశించడం అయినది.

**గార్లదిన్నెలో..** నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 2025 నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు డిసెంబర్ 31,నాడే పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో యం. గోపాల్ శనివారం ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, మండల వ్యాప్తంగా జనవరి ఒకటి బదులు ఈనెల డిసెంబర్ 31 తేదీనే ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత ఫించన్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు నూతన సంవత్సరాన్ని పెన్షన్ల లబ్ధిదారులు అందరితోపాటు ఆనందంగా గడపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుం జారీ చేయడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు డిసెంబర్ 31వ తారీఖున జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ప్రకారం లబ్ధిదారులకు ఉదయం 6,00 గంటల నుంచి 7,00గంటల లోపు సచివాలయ సిబ్బంది, పంపిణీ అధికారులు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి 100% పెన్షన్లు పంపిణీ చేయాలని సంబంధిత ఫంక్షన్ పంపిణీ అధికారులకు ఎంపీడీవో యం. గోపాల్ ఆదేశించారు.



# బాబు మా జాబ్ ఎక్కడ.. వాలంటీర్ వ్యవస్థ ఎక్కడ

- అబద్ధపు హామీలతో యువతను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- నిరుద్యోగ భృతి హామీ పూర్తిగా విస్మరించారు
- ఉద్యోగమైనా ఇవ్వండి జైల్లోనైనా వేయండి
- ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్




**రాయదుర్గం– సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అనంతపురం క్లాక్ టవర్ సమీపంలో నిరుద్యోగులతో భిక్షాటన చేస్తూ ప్రతిఘటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్ మరియు జిల్లా అధ్యక్షుడు కావలి కోట్రేష్ మాట్లాడుతూ ప్రభుత్వం వైఫల్యాల కారణంగా రాష్ట్రంలో నిరుద్యోగుల పరిస్థితి రోజు రోజుకు మరింత దయనీయంగా మారుతోందని పేర్కొన్నారు. చేతగాని దద్దమ్మ ప్రభుత్వం వల్లనే నిరుద్యోగులు రోడ్డునెక్కి భిక్షాటన చేసుకునే పరిస్థితికి నెట్టివేయ బడ్డారని వారు తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగ హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం మౌనం పాటించడం వల్ల చదువుకున్న యువత నిరాశలోకి నెట్టివేయబడుతున్నారని తెలిపారు. ఉద్యోగ హక్కు కల్పించాల్సిన ప్రభుత్వం, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి బాధలను మరింత పెంచే విధానాలు అమలు చేయడం అత్యంత విచారకరమని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగం తీవ్రమైన సమస్యగా మారుతున్న ఈ సమయంలో ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని యువత మండిపడుతోందని వారు చెప్పారు. ముఖ్యంగా నిరుద్యోగ భృతి మరియు వాలంటరీ ఉద్యోగాల సమస్యలు యువత జీవితాలపై నేరుగా ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి నిరుద్యోగ యువకుడికి నెలకు నిరుద్యోగ భృతి అందిస్తామని, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి అమలులో స్పష్టత లేకపోవడం, అర్హతల విషయంలో గందరగోళం, దరఖాస్తు ప్రక్రియ ఆలస్యం వంటి కారణాలతో లక్షలాది మంది యువత ఇంకా ప్రయోజనం పొందలేకపోతున్నారని అన్నారు. నిరుద్యోగ భృతి ఓటు రాజకీయాలకు పరిమితం కాకుండా, ఉద్యోగం కోసం పోరాడుతున్న యువతకు తాత్కాలిక ఆర్థిక భరోసా కావాలని వారు కోరారు.

వారు మరింతగా మాట్లాడుతూ, రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉన్న వాలంటరీ ఉద్యోగాల సమస్య కూడా తీవ్రమైందని తెలిపారు. గ్రామ/వార్డు వాలంటీర్లుగా పనిచేసిన వేలాది మంది యువతకు ఉద్యోగ భద్రత, స్థిరత్వం, సామాజిక రక్షణ వంటి ప్రాథమిక హక్కులు లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అనేక చోట్ల వాలంటీర్లను తొలగించడం, గౌరవ వేతనం ఆలస్యం కావడం, భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడం వలన ఈ యువత మళ్లీ నిరుద్యోగుల జాబితాలో చేరుతున్నారని అన్నారు. శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా వాలంటరీ వ్యవస్థను కొనసాగించడం ద్వారా తాత్కాలిక మరియు తక్కువ వేతనాల విధానాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విమర్శించారు. ఒక వైపు నిరుద్యోగ భృతి అమలు చేయకపోవడం, మరోవైపు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేయకుండా యువత భవిష్యత్తును దెబ్బతీసే విధానాలేనని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఎన్నికల హామీలను నిలబెట్టుకుని జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి నెలకు రూ.3000 అందించడంతో పాటు వాలంటీర్లకు భద్రమైన ఉద్యోగ విధానాన్ని రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత తీవ్రంగా కొనసాగిస్తామని ఏఐవైఎఫ్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐవైఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాస్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు దేవ ధనుంజయ్. అనంతపురం నగర అధ్యక్షుడు ఆనంద్ అనంతపురం నగర ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, రాంబాబు, సురేంద్ర, బండారు తేజ రియాజ్, అశోక్ నాజీర్, సుమంత్, సింహ లియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ధనుర్మాసంలో తుమ్మూరు సందర్శన

- స్థానిక సమస్యలపై పరిశీలన
- గ్రామస్తుల వినతులకు స్పందించిన మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం



**నాయుడుపేట– సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** ధనుర్మాసం సందర్భంగా మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, మాజీ టీటీడీ బోర్డు సభ్యులు నెలవల సుబ్రహ్మణ్యం శనివారం తుమ్మూరు గ్రామంలోని శ్రీ శ్రీ కరిమాణిక్య స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది, గ్రామస్తులు ఆలయ ఆధునీకరణతో పాటు గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వారి అభ్యర్థనలను పరిశీలించిన నెలవల సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆలయ అభివృద్ధితో పాటు గ్రామంలోని మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పసల గంగా ప్రసాద్, మైలారి రాజశేఖర్, అవధానం సుధీర్, సంచి కృష్ణయ్య, శివాజీ రెడ్డి, పసల శ్రీనివాసులు, మోరా మోహన్ కిషోర్, మేళ్లపాక పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై సత్వరమే పరిష్కారం చూపాలి

- వార్డు సమస్యల పరిష్కారానికి వైయస్ మనోహర్ రెడ్డి కృషి



**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వార్డులలో నెలకొన్న సమస్యలపై సత్వరమే పరిష్కార మార్గం చూపుతున్న వైఎస్ మనోహర్ రెడ్డి కృషి అభినందనీయమని వార్డు ప్రజలు పేర్కొన్నారు. శనివారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని చిన్న కొండారెడ్డి కాలనీ, వాసవీ కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ మురుగునీరు తదితర సమస్యలు మునిసిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి ఛైర్మెన్ వరప్రసాద్‌ల దృష్టికి రాగా సత్వరమే సమస్యలపై మున్సిపల్ అధికారులకు తెలిపి పరిష్కార మార్గం చేశారు. ఈ సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పులి వెందుల మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వార్డులోనూ తమ తమ పరిసర ప్రాంతాలు పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, తడి చెత్త పొడి చెత్త వేరు చేసి మున్సిపాలిటీ వాహనాలకు అందించాలని, వార్డులలో ఎక్కడైనా సమస్య తలె త్తితే వారి దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కార మార్గం చూపుతానని తెలి పారు. ఈ కార్యక్రమంలో పులివెందుల పట్టణ ఉపాధ్యక్షుడు పార్లపల్లి కిషోర్, వైసీపీ నాయకులు ప్రసాద్ శెట్టిలు వార్డుల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో పేదలకు కొండంత అండ..

- సీఎం చంద్రబాబు నాయుడు చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ
- పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి



**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభు త్వం పేదల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. శనివారం పులివెందుల టీడీపీ కార్యాలయంలో 58 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 31,85,203 (ముప్పై ఒక్క లక్షల ఎనభై ఐదు వేల రెండు వందల మూడు రూపాయలు) విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిచి పోయిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించి, ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుస్తోందని ఈ సందర్భంగా బీటెక్ రవి తెలిపారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ వైద్య ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకున్న 58 మంది నిరుపేదలకు, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి నిధులను విడుదల చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన దరఖాస్తులను సైతం యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి, బాధితులకు నేరుగా లబ్ధిచేకూరుస్తున్నామని ఆయన వివరించారు. పులివెందుల నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అని, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

# హిందూ సమ్మేళనానికి తరలిరండి

- ఆంజనేయ స్వామి ఆలయంలో హిందూ సమ్మేళన నిర్వాహకుల ప్రత్యేక పూజలు



**సింహాద్రిపురం – సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** ఈనెల ఆదివారం నిర్వహించబోవు హిందూ సమ్మేళన కార్యక్రమం విజయ వంతం చేయాలని హిందూ సమ్మేళన నిర్వహకులు పిలుపునిచ్చారు. వాటిలో భాగంగా. శనివారం సింహాద్రిపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో హిందూ సమ్మేళన కార్యక్రమం విజయవంతం కావాలని హిందూ సమ్మేళన నిర్వహకులు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. అనంతరం హిందూ సమ్మేళ నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ ఆదివారం సాయంకాలం మూడు గంటల సమయంలో సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ ఆవరణంలో హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హాజరవుతున్న శ్రీ భువనేశ్వరి పీఠం గన్నవరం విజయవాడ పూజ్యశ్రీ కమలానంద భారతి స్వాములవారు శ్రీ జగదీశ్వర, ప్రసాద్ మహిళావక్త ఎన్ మానసవెంకట్ తదితర ముఖ్య వక్తలను ఘన స్వాగతం పలుకుతూ ర్యాలీగా మార్కెట్ యార్డ్ వద్దకు వెళ్లడం జరుగుతుంద న్నారు.

ఈ కార్యక్రమాల్లో భాగంగా మేధా స్కూల్ విద్యార్థిని విద్యార్థులచే సంస్కృతిక భరతనాట్యం వంటి కార్య క్రమాలను చేపట్టడం జరుగుతుందని, సింహాద్రిపురం చుట్టుపక్కల గ్రామ ప్రజలు హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని హిందూ సమ్మేళన కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## అంజన్నకు విశేష పూజలు

- ప్రత్యేక అలంకారంలో వీరాంజనేయ స్వామి



**సింహాద్రిపురం – సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** సింహాద్రిపురం గ్రామంలో అతి పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో భాగంగా ధనుర్మాసాన్ని పురస్కరించుకుని వేకువజామునే స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన అష్టోత్తర శతనామావళి తదితర పూజ కైకర్యాల అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి శనివారం మంగళవారం భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించడం జరుగుతుందని, అంతేకాకుండా మంగళవారం శనివారాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రానున్న ముక్కోటి ఏకాదశి పర్వదినాన వేకువజామున నుండి విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- డి.ఎస్.పి మురళీ నాయక్



**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** రానున్న 2026 న్యూ ఇయర్ వేడు కలను ప్రశాంతంగా జరుపుకోవాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని పులివెందుల డిఎస్పి మురళి నాయక్ హెచ్చరిస్తూ సూచించారు. ఈ సందర్భంగా ఆయన పత్రికాముఖంగా తెలియజేస్తూ డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడకూడదని, ప్రజలకు ఇబ్బందులు కలిగించ వద్దని సూచించారు. న్యూ ఇయర్ వేడుకలను కుటుంబ సమేతంగా, ఇళ్లలో సంతోషంగా నిర్వహిం చుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్, రాష్, రాంగ్ రూట్ డ్రైవింగ్, దాడులు, బెదిరింపులకు పాల్పడడం, రోడ్లపై వెళ్ళేవారిని ఇబ్బందికి గురి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాన కూడళ్లలో డ్రంకెన్ డ్రైవ్, ఆక స్మిక తనిఖీలతోపాటు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తామని, సూచిస్తూ ప్రశాంత వాతావరణంలో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని సూచనలు సలహాలు తెలిపారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే

# కూటమి ప్రభుత్వ లక్ష్యం

### - ప్రజా దర్బార్లో పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి

**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** పులివెందుల నియోజకవర్గ ఇన్-ఛార్జ్ బీటెక్ రవి శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో 'ప్రజా దర్బార్' నిర్వహించారు. నియోజక వర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభు త్వంలో ప్రజలకు జవాబుదారీగా ఉంటూ, ప్రతి సమస్యను పరిష్కరిస్తామని రవి భరోసా ఇచ్చారు. ప్రజలు సమర్పించిన వినతులను పరిశీలించి, వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ ప్రజలు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భూ రీసర్వే ప్రక్రియపై అవగాహన ర్యాలీ

### - రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం
### - తహసీల్దార్ వై.హరినాథ్ రెడ్డి




**వేంపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 27 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ రీసర్వే ప్రక్రియపై అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. శనివారం స్థానిక చింతలమడుగుపల్లి గ్రామంలో తహసీల్దార్ వై.హరినాథ్ రెడ్డి, సిబ్బంది, రైతులు, టిడిపి నాయకులు పాల్గొని అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ రీసర్వే ద్వారా ఎన్నో దశాబ్దాల నుంచి ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, రైతులు భూ రీసర్వే చేయించుకోవాలని కోరారు. రైతులందరు రీసర్వే టీంలు కొలతలు వేసే రోజు పొలాలకు వెళ్లి తమ వద్ద ఉన్న పట్టా దారు పాసు పుస్తకాలు, లింక్ డ్యాక్ మెంట్లు తదితర పత్రాలు అధికారులకు చూపించాలన్నారు. రీసర్వే ప్రక్రియను సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లోకేష్, టిడిపి నాయకులు శివకృష్ణారెడ్డి, రామాంజీ, చిన్న ఓబుల్ రెడ్డి, నాగిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు పులివెందులలో హిందూ సమ్మేళనం

### - హిందూ బంధువులు తరలి రండి

**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** పులివెందులలో శ్రీ వాసవి ఫంక్షన్ హాల్‌లో ఉదయం ఎనిమిది గంటల 30 నిమిషాలకు హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనము నిర్వహించ బోతున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృష్ణాజిల్లాలోని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి విచ్చేయు చున్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు సనాతన ధర్మం వంటి విషయాలపైన రేపటి దినము హిందు బంధువులందరినీ జాగృతం చేయబోతున్నారు. ఈ కార్య క్రమంలో మొదట సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభం తర్వాత అతిధుల ప్రసంగాలు ఉంటాయని చివరగా ముఖ్య అతిథి అయినటువంటి కమలానంద భారతి వారి ప్రసంగం ముగిసిన తర్వాత అన్న ప్రసాద వితరణ కూడా ఏర్పాటు చేయడమైనదని నిర్వాహకులు తెలిపారు. కాబట్టి ప్రతి హిందువు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా నిర్వాహకులు కోరుచున్నారు.

# హిందువులు ఐక్యతగా ముందుకు సాగాలి





**సింహాద్రిపురం- సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** హిందువుల ఐకమత్యంగా ముందుకు సాగాలని ప్రధాన వక్త వెంకటేశ్వర్లు అన్నారు. హిందువులు ఏకతాటిపై నడవాలని ప్రధానవక్త వెంకటేశ్లు పేర్కొన్నారు. సింహాద్రిపురం మండలం తెలుకి ఉపమండలం సుంకేసుల ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణలో శనివారం సాయింత్రం హిందూసమ్మేలనం కార్య క్రమం జరిగింది. అంతకు ముందు స్వామి వారు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం అనంతరం వక్తలు మాట్లాడారు సింహాద్రిపురం మేధా హైస్కూల్ విద్యార్థులు నిర్వ హించిన సంస్కృతి కారక్రమాలు అలరించారు. కార్యక్రమంలో చక్రధర్ జీ శ్యామ్ సుందరెడ్డి, రామ లక్ష్మమ్మ, కనకయ్య స్వామి, శివయ్య, నిర్వాహకులు అమర్‌నాథరెడ్డి, డ్యాన్స్ మాస్టర్ మానస, వివిధ గ్రామాల హిందూ బంధువులు తదితరులు పాల్గొన్నారు

# 30 కోట్ల నరేగా నిధులతో సీసీ, తారు రోడ్లు

### - సీఎంకు దుర్గం ప్రజలు పక్షాన కృతజ్ఞతలు
### - సీసీ రోడ్లకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు





**రాయదుర్గం - సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** నియోజక వర్గంలో ఏడాది నరకాలంలో 30 కోట్ల నరేగా నిధులతో సీసీ తారు రోడ్లు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలు శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం మండల పరిధిలోని రామకృష్ణ వృద్ధాశ్రమంలో శనివారం ఎమ్మెల్యే సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గత ఏడాది సంక్రాంతి సందర్భంగా పెద్ద ఎత్తున సిసి రోడ్ల నిర్మాణక శ్రీకారం చుట్టామన్నారు నియోజక వర్గంలోని 18. 85 కోట్ల పనులను చేపట్టం జరిగిందని, పల్లె పండుగ రెండు పేరుతో 8.35 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టమన్నారు. ఇటీవల2.70 కోట్ల ఖర్చు చేసి సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు వివిధ గ్రామాల్లో చేపడుతున్న 74 పనులు రాయదుర్గం రూరల్ మండలంలో భూమి పూజ చేశామని ఎమ్మెల్యే తెలియజేశారు మొత్తం ఏడాదిన్నర కాలంలో 30 కోట్ల సీసీ తారు రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద మాత్రమే చేపట్టినట్లు వివరించారు. ఇతర నియోజకవర్గాల కంటే రాయదుర్గం కు నిదురిస్తూ ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు నియో జకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మన్నారు. ముఖ్యమంత్రి ఆశీస్సులు రానున్న మూడు సంవత్సరాల కాలంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్య క్రమాలకు నిధులు తీసుకొచ్చి రాయదుర్గం నియోజకవర్గం ముందుకు నడిపిస్తామని ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కురువ హను మంతు, కాటా వెంకటేశులు, వాల్మీకి సిద్ధప్ప సోము రాజశేఖర్ వన్నూరు స్వామి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# ప్రస్తుత పరిస్థితుల్లో జనాభా పెంపు అనర్ధదాయకం

### - ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్ఎస్ఎస్ నాయకులు పునరాలోచించాలి
### - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** దేశానికి జనాభాయే ఆస్తి, ప్రతి జంట ముగ్గురు పిల్లల్ని కనాలి అని శుక్రవారం తిరుపతిలో విజ్ఞాన భారతి నిర్వహించిన భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడం సమంజసం సమర్థనియం కాదని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ న రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శనివారం వేంపల్లి లో మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ జనాభా 809 కోట్లని, ప్రపంచంలో 242 దేశాలు ఉన్నాయి అని, ఇందులో భారతదేశపు జనాభా 144 కోట్లని, ప్రపంచ దేశాలలో భారతదేశం ఇప్పటికే జనాభాలో నంబర్ వన్ స్థానంలో ఉందని తులసి రెడ్డి అన్నారు. ఇప్పటికే జనాభాలో చైనాను మించిపోయాం. చైనా జనాభా 142 కోట్లు. రెండవ స్థానంలో ఉంది.మూడవ స్థానంలో ఉన్న అమెరికా జనాభా కేవలం 34 కోట్లు మాత్రమే. ప్రపంచ జనాభాలో భారత దేశపు జనాభా 18శాతం, కాగా ప్రపంచ భూ భాగంలో భారతదేశపు భూభాగం కేవలం 2.4 శాతం మాత్రమే. చదరపు కిలోమీటర్ కు ఉన్న జనాభాను జన సాంద్రత అంటారు. ప్రపంచ జనసాంద్రత 55 కాగా, భారతదేశపు జనసాంద్రత 488, చైనా జనసాంద్రత 151,అమెరికా జనసాంద్రత 38, రష్యా జనసాంద్రత కేవలం 9. ఇప్పటికే భారతదేశం జనాభాతో క్రిక్కిరిసి పోయింది. ఉన్న వాళ్లకే తినేదానికి తిండి,ఉండే దానికి గూడు, కట్టేదానికి బట్ట, త్రాగేదానికి నీరు సరఫరా చేయలేని పరిస్థితిలో ఉన్నాం. నిరుద్యోగం వికటాట్టహాసం చేస్తూ ఉంది.నిరక్షరాస్యత శాతం, నిరుపేదల శాతం ఎక్కువగా ఉంది.ఉన్నవారికే ఉద్యోగాలు, ఉపాధి కల్పించ లేకపోతున్నాం.యువత ఉపాధి, ఉద్యోగాలు లేక అసాంఘిక శక్తులుగా తయారవు తున్నారు. మద్యము, డ్రగ్స్, గంజాయికి బానిసలవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో, దేశంలో అన్ని రాష్ట్రాలలో స్థానిక, స్థానికేతర అంశాల అంశం తీవ్రంగా ఉంది. అమెరికా, కెనడా,ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ తదిత దేశాలలో ఉద్యోగాలు చేస్తున్న భారతీయులు తెలుగువారు అక్కడ ఉద్యోగాలు వదిలి దేశానికి,రాష్ట్రానికి తిరిగి రావలసిన దుస్థితి దాపురించింది.అదేవిధంగా దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఇదే పరిస్థితి ఉంది.

భారతదేశం ప్రపంచ దేశాలలో సంతోష సూచికలో 144 స్థానంలో, ఆకలి సూచికలో 101 వ స్థానంలో,తలసరి ఆదాయంలో 144 స్థానంలో ఉంది.పులిని చూచి నక్క వాతలు పెట్టుకున్నట్లు ఉంది ముఖ్యమంత్రి వాలకం. జపాన్, దక్షిణ కొరియా తదితర దేశాలలో వృద్ధుల శాతం ఎక్కువైపోతోంది,జనాభా తగ్గి పోతూ ఉంది,యువకుల సంఖ్య తగ్గి పోతూ ఉంది, అదే పరిస్థితి మనకు రాకూడదు,అందుకోసం జనాభా పెంచాలి అని ముఖ్యమంత్రి గారు తరచూ చెబుతున్నారు. జపాన్ జనాభా కేవలం 12 కోట్లు,భారత్ జనాభా 144 కోట్లు.జపాన్ జనసాంద్రత 340, భారత జనసాంద్రత 488.జపాన్ తలసరి ఆదాయం 34,713 డాలర్లు,భారత్ తలసరి ఆదాయం కేవలం 2818 డాలర్లు.కాబట్టి జపాన్ తో పోల్చుకోవడం ఏమాత్రం సమర్థ నీయం కాదు. కాబట్టి ఇప్పటికైనా జనాభా విషయంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు, ఆర్ఎస్ఎస్ నాయకులు పునరాలోచించాలని తులసి రెడ్డి సూచించారు.

# మున్సిపాలిటీ వార్డులలో సమస్యలు తలెత్తకుండా చూడాలి

### - మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం



**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** పులివెందుల మున్సిపాలిటీలో ప్రతి వార్డు లోనూ సమస్యలు తలెత్త కుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని, అదే విధంగా ప్రజా ప్రతినిధులు నుండి వస్తున్న ఫిర్యాదులను అధికా రులు సత్వర పరిష్కార మార్గం చూపా లని కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాల యంలో కౌన్సిల్ సమావేశం చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైయస్ మనోహర్ రెడ్డి, కమిషనర్ రాముడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ప్రజల మున్సిపాలిటీలో యూజీడి, వీధిలైటు నిర్వహణ, మంచినీటి సమస్య లేకుండా చూడాలన్నారు. మున్సిపల్ అధికారులు కూడా కౌన్సిలర్లు చెప్పిన వెంటనే స్పందించి వాటి పరిష్కారాని చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా అవార్డుల కౌన్సిలర్లు సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. అదేవిధంగా బ్రాహ్మణపల్లె గ్రామంలో వీధిలైటు నిర్వహణ, యుజిడి సమస్యలు ఉన్నాయని ఆ వార్డు కౌన్సిలర్ మహేష్ రెడ్డి కౌన్సిల్ దృష్టికి తీసుకవచ్చారు. అలాగే భాకరాపురంలో వీధిలైట్లకు స్విచ్ లేక దాదాపు 20 లైట్లు ఇబ్బందిగా ఉన్నాయన్నారు. వెంటనే వాటికి వీధిలైట్లకు స్విచ్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో వీధిలోని నిర్వహణలో సిబ్బంది ఇబ్బందికరంగా ఉంటే నేనే కరెంటు పోల్ ఎక్కి వీలైట్లు ఏర్పాటు చేస్తానని అనడంతో అధికారులు వెంటనే స్పందించి ఇబ్బంది లేకుండా వీధిలైట్లు ఏర్పాటు చేస్తామని మున్సిపల్ కమిషనర్ రాముడు కౌన్సిలర్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా విడుదల మున్సిపాలిటీలో పెండింగ్లో ఉన్న వివిధ పనులను పరిష్కరించేందుకు కౌన్సిల్ ఆమోదముద్ర చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో పాటు కౌన్సిలర్లు కో ఆప్షన్లు తదితరులు పాల్గొన్నారు.




# నవోదయ విద్యార్థిని శివానికి ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కారం

### - రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా పురస్కారం అందుకున్న విద్యార్థిని



**మదనపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో కామర్స్ విభాగంలో 12 వ తరగతి చదువుచున్న విద్యార్థిని శివాని ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కారానికి ఎంపికైంది. 26వ తేది శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకుంది. జావెలిన్ త్రో, షాట్ పుట్ లో కనబరుస్తున్న ప్రతిభను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. శివాని 2023 గుజరాత్ లోను 2024 లో బెంగుళూరు లో జరిగిన పారా జాతీయ క్రీడల్లో జావలిన్ త్రో లోను, షాట్ పుట్ లోను రెండేళ్లు రెండు విభాగాల్లోను బంగారు పతకాలను సాధించింది. 2023 లో థాయ్‌లాండ్ లో జరిగిన అంతర్జాతీయ పారా స్పోర్ట్స్‌లో జావలిన్ త్రో లోను, షాట్ పుట్ లోను రెండు బంగారు పతకాలు సాధించింది. 2024 లో థాయ్‌లాండ్ లోనే జరిగిన అంతర్జాతీయ పారా స్పోర్ట్స్‌లో షాట్ పుట్‌లో బంగారు పతకాలు సాధించింది. గత నాలుగేళ్లుగా శివాని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాధిస్తున్న విజయాలను దృష్టిలో ఉంచుకొని ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఈ పురస్కారానికి దరఖాస్తు చేయించినట్లు ప్రిన్సిపాల్ గీత తెలిపారు. జాతీయ స్థాయిలో పురస్కారం అందుకున్న శివాని విద్యాలయానికి, జిల్లాకు, రాష్ట్రానికి గర్వకారణమని ప్రిన్సిపాల్ తెలిపారు. 'పువ్వు పుట్టగానే పరిమ లించినట్లు' అన్న ఆర్యోక్తిని నిజం చేసి ప్రతిభ చాటిన శివాని నవోదయ ఉపాధ్యాయులు, అద్యాపకులు, విద్యార్థులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

- మరమ్మతులకు రెండు లక్షల నిధులు మంజూరు..
- ఎమ్మెల్యే కాలువకు కృతజ్ఞతలు తెలిపిన ఆంధ్ర కర్ణాటక సరిహద్దుల ప్రజలు
- ఎమ్మెల్యే కృషితో సరిహద్దుల రోడ్లు మరమ్మతులు..

## ఆంధ్ర -కర్ణాటక సరిహద్దు
# లింక్ రోడ్డుకు మరమ్మతులు





**రాయదుర్గం – సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** ఎన్నో సంవత్స రాల నుండి ఆంధ్ర కర్ణాటక లింక్ సరిహద్దుల రోడ్డును గత పాలకులు పరిష్కరించే లేని సమస్యను ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు ప్రజలకు సౌకర్యవంతంగా ప్రయాణం ఉండటానికి ప్రత్యేక చొరవ తీసుకొని, ఆంధ్ర కర్ణాటక సరిహద్దుల లింక్ రోడ్డులకు మరమ్మతులు చేపట్టేందుకు ఎమ్మెల్యే కృషి చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎంపీడీవో దాస్ నాయక్ మరమ్మతులకు రెండు లక్షలు నిధులు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొ న్నారు. మండల కేంద్రం నుండి బళ్లారి జిల్లా కర్ణాటక బసాపురం గ్రామంకు వెళ్లే సరిహద్దు లింకు రోడ్డు లకు మండల పరిషత్ నిధులతో మరమ్మతులు కల్పించారు. ఈ మరమ్మతులు వల్ల కర్ణాటక ప్రాంతాలైన బసాపురం మీదుగా గుడేకోట కూడ్లికి అర్పణ హల్లి కొట్టూరు నగల్లి తదితరులు ప్రాంతాలకు ప్రజలు సౌకర్యవంతంగా ప్రయాణం చేసుకోవచ్చని కర్ణాటక వాసి అమర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సరిహద్దుల మరమ్మతులతో ఇరు రాష్ట్రాల గ్రామాల వాణిజ్య ఆర్థికపరమైన వ్యవహారాలు ఇతర అభివృద్ధి దోహదమని ఇరు రాష్ట్రాల సరిహద్దు ప్రజలు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రహదారిని ఆరు రోడ్లుగా మార్చి ప్రయాణానికి మరింత సులువుగా చేయాలని మండల కేంద్రంలో ప్రజా దర్బార్లో కాలువ శ్రీనివాసులను ప్రజలు కోరారు.





# రికార్డ్ స్థాయిలో చేపలు ఉత్పత్తి చేస్తాం

- మత్స్యకారుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు
- 10.4 లక్షల చేప పిల్లలను బీటీపీలోకి వదిలిన ఎమ్మెల్యే



**రాయదుర్గం – సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** మత్స్య కారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుం దని ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు పేర్కొన్నారు. బి టి పి ప్రాజెక్ట్ లో రికార్డ్ స్థాయిలో చేపలు ఉత్పత్తి చేస్తామని, దాదాపుగా 10.4 లక్షల చేప పిల్లలను ఎమ్మెల్యే కాలువ బీడీపీ ప్రాజెక్టు లోకి వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అనేక జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయని. ఈ ఏడాది ప్రాజెక్టుల్లో చేప పిల్లలు పెంపకం ఆశాజనకంగా ఉంటుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు మత్స్యకారులకు అవసరమైన సంపూర్ణ సహకారం అందించడంలో ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్న రాయదుర్గం నియోజక వర్గం అభివృద్ధికి అన్ని విధాల సహకారం అందిస్తున్నారని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలోని బైరవని తిప్ప ప్రాజెక్టుకు 6. 40 లక్షల చేప పిల్లలను గత ఏడాది వదిలామని, ప్రస్తుత సంవత్సరం 10.4 లక్షల చేప పిల్లలను వదిలినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కొన్ని కారణాలవల్ల చేప పిల్లలు మధ్యలోనే చని పోయిన లేదా వలలకు చిక్కకపోయినా కనీసం 50శాతం పట్టుకోవడానికి వీలవుతుందన్నారు. ఈ ఏడాది సుమారు 26 కోట్ల విలువచేసే మత్స్య సంపాదన అందుబాటులో ఉంటుందని వివరించారు. చేపలు పట్టుకోవడానికి మత్స్యకారులు సంఖ్య కూడా పెరగాలన్నారు.



ప్రాజెక్టుకు ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో ఉంటూ ఆసక్తి ఉన్న మత్స్యకారులు తమ పేర్లను ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలియజేశారు. ఉన్న పరిస్థితుల్లో అధిక లాభాలు పొందాలని ఆశాభవం ఎమ్మెల్యే వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం అభివృద్ధితోపాటు మత్సకారుల కుటుంబాలకు ఆర్థిక బలంగా ఎదగాలన్నదే, మా ప్రభుత్వ ధ్యేయమని, పిల్లలను శ్రద్ధగా విద్యాలయాలకు పంపుతూ ఉన్నతమైన చదువులు చదివించాలని మత్సకారులకు ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కాలువ సన్నన్న, రమేష్, చిన్నికృష్ణమూర్తి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కామన్ అడ్మిషన్ టెస్ట్‌పై అవగాహన



**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 27 :** కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)పై ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శనివారం ట్రిపుల్ ఐటీ పోటి పరిక్షల విభాగం అధికారి డా.కోనప్ప ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ సందర్భంగా అకాడమిక్ డీన్ రమేష్ కైలాస్ మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష క్యాట్ అని అన్నారు. అగ్రశ్రేణి మేనేజ్మెంట్ సంస్థల్లోకి ప్రవేశం పొందేందుకు వీలు కల్పిస్తోందన్నారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ చదివిన విధ్యార్థులు ఒక సంస్థలో ఉద్యోగిగా కాకుండా సంస్థకే ప్రాతినిధ్యం వహించేలా తయారు అవుతారన్నారు. అలాగే విచ్చేసిన 100 పర్సెంటైల్ శిక్షణ సంస్థ నిపుణులు కిషోర్ కుమార్, రామకృష్ణ లు క్యాట్ పరీక్ష సరళి, సన్నద్ధతపై అవగాహన కల్పించారు. వెర్బల్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, ఆర్థమెటిక్, ఆల్జీబ్రా తదితర ముఖ్యమైన అంశాల్లోని ప్రశ్నల తీరు, ఎలా సాధించాలో, మాక్ టెస్ట్ ల ప్రాముఖ్యతలపై విధ్యార్థులకు స్పష్టతనిచ్చారు. అనంతరం తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మాక్ టెస్ట్ నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి ఉచిత శిక్షణ అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణావతారంలో దర్శనమిచ్చిన శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వరుడు



**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 27 :** వేంపల్లెలోని శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం అనుసంధానంలో గల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాసం రెండవ శనివారం సందర్భంగా శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామివారు కృష్ణావతారంలో భక్తులకు కటాంక్షించారని ఆలయ ఈఓ హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రవీణ్ నేతృత్వంలో శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి వారికి సూర్యోదయానికి ముందు ప్రాతఃకాల ఆరాధన, సహస్ర నామార్చన,ధూప దీప నైవేద్యం,నక్షత్ర హారతి, కుంభహారతి,రథ హారతి, శాత్తుమురై,మహా మంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించామన్నారు. పూజల్లో భాగంగా శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామివారిని గజమాలలతో కృష్ణుడిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించామన్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం శ్రీ కృష్ణ నామస్మరణంతో మారుమ్రోగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి ఛైర్మన్ పీవీ రమణ,సభ్యులు, ఆలయ సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

## జైలులో అభిమానులను పరామర్శించిన డీవీ శశికాంత్ రెడ్డి



**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** వైఎస్ఆర్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఖమ్మం జిల్లాలో నిర్వహించిన వేడుకలు రాజకీయంగా తీవ్ర ఉత్కంఠను సృష్టించాయి. అభిమానుల ఆనందోత్సాహం పోలీసు చర్యలతో ఉద్రిక్తతకు దారి తీసి, పలువురు జగన్ అభిమానులు అరెస్ట్ అయ్యి జైలుకు తరలించబడ్డారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది.

### ప్రజాభిమానమే భయమా?

జగన్ పుట్టినరోజును ప్రజా పండుగలా నిర్వహించాలన్న అభిమానుల ప్రయత్నాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలు వలకు విరుద్ధమని వైఎస్ఆర్సీపీ నేతలు మండిపడ్డారు. శాంతి యుతంగా నిర్వహించిన వేడుకలకే అక్రమ కేసులు నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ వైఖరి బహిర్గతమైందని పార్టీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. జైలుకు వెళ్లిన అభిమానులను పరామర్శించిన డివి శశికాంత్ రెడ్డి. ఈ పరిణామాలపై స్పందించిన వైఎస్ఆర్సీపీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు డివి శశికాంత్ రెడ్డి వెంటనే ఖమ్మం చేరుకుని, జైల్లో ఉన్న జగన్ అభిమానుల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ముందుగా ఆయన అరెస్టైన అభిమానుల కుటుంబ సభ్యులను కలుసుకుని వారి బాధలు విన్నారు. ఆ తరువాత జైలులో ఉన్న అభిమానులను పరామర్శించారు.

## హిందూ సమ్మేళనం జయప్రదం చేద్దాం



**వేముల– సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వంద సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా వేములోని గుట్టమీద గల శివాలయం నందు నిర్వహించే హిందూ సమ్మేళనాన్ని ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయవలసిందిగా ఐక్య వేదిక సభ్యులు పేర్ల శేషారెడ్డి , పేర్ల సత్యంరెడ్డి .పోటు గంగా భాస్కర్ , మొయిళ్ల రామకృష్ణారెడ్డి , నారుబోయిన గంగయ్య, శేషన్న పల్లి, వేములలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర హ్యూమన్ రైట్స్ డిఫెన్స్ కౌన్సిల్ జనరల్ సెక్రెటరీగా మోడెం మదన్ మోహన్



**రాయచోటి–సూర్య వాస్తవం,డిసెంబర్ 27:** అన్నమయ్య జిల్లా పరిధిలోని వీరబల్లి మండలానికి చెందిన మోడెం మదన్ మోహన్ ఏపీ హ్యూమన్ రైట్స్ డిఫెన్స్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. శనివారం తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని ప్రధాన కార్యాలయంలో రియాన్ అంతర్జాతీయ మానవ హక్కుల రక్షణ మండలి డైరెక్టర్ ఎం.కె.జాన్ వెస్లీ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు మదన్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కులు వ్యక్తులకు వారిగౌరవాన్ని,హుందాతనాన్ని కాపాడుకోవడానికి, సమాజంలో సమానంగా జీవించడానికి శక్తినిస్తాయని అన్నారు. ప్రభుత్వాలు మరియు ఇతరుల నుండి రక్షణ పొందేలా చేస్తాయని అనన్నారు. ప్రజలకు అన్యాయం జరిగిన న్యాయపోరాటం చేసి హక్కులను కాపాడుటకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పదవి రావడానికి సహకరించిన డైరెక్టర్ ఎం.కె. జాన్ వెస్లీ, రియాన్ ఇంటర్నేషనల్, హ్యూమన్ రైట్స్ చీఫ్ ఇన్చార్జి షబ్బీర్, ఆ సంస్థ రాష్ట్ర సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## నిత్య అన్నదానానికి విరాళాలు

### - గండి క్షేత్ర సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య

**చక్రాయ పేట – సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** చక్రాయ పేట మండలం శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానానికి నిత్య అన్నదాన పథకానికి విరాళాల ద్వారా సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని గండి క్షేత్ర సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. గండిక్షేత్రంలో నిర్వహించు నిత్య అన్నదాన పథకానికి కత్తులూరు గ్రామానికి చెందిన లింగాల శివ సాయి రెడ్డి కుటుంబ సభ్యులు మరియు హైదరాబాద్ వాస్తవ్యులు అజయ్ కౌశిక్ కుటుంబ సభ్యులు అన్నదానానికి సంబంధించి 50 వేల 116 రూపాయల మొత్తాన్ని ఆన్లైన్లో ద్వారా విరాళాలు అందించడం శుభసూచకమని కోరుకుంటూ వారికి ప్రధాన అర్చకులు కేసరి స్వామి ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామి కేసరి స్వామి మాజీ చైర్మన్ వెంకటస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శనం మరియు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు



## మంచి ఆలోచనలతో చేస్తున్న
# కార్యక్రమాలను అపార్థం చేసుకోకండి

- ఎవరి మతాన్ని కించపరచాల్సిన అవసరం తనకు లేదు
- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



**కదిరి - సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** కదిరి నియోజకవర్గంలో మంచి ఆలోచనలతో చేస్తున్న కార్యక్రమాలను ఎవరూ కూడా తప్పుగా అర్థం చేసుకోవద్దని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్ అండ్ బి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కదిరి నియోజకవర్గంలో ఉన్నటు పోలీస్ స్టేషనులకు పోలీసు వాహనాలను సమకూర్చడం జరిగిందని.. చాలామంది దాతల సహాయ సహకారాలతో పాటు సి ఎస్ ఆర్ నిధులతో వాహనాలను సమకూర్చడం జరిగిందన్నారు. వాహనాలను పోలీస్ శాఖకు అప్పగించేందుకు ముందుగా కదిరి పట్టణంలోని శ్రీమత్ ఖాద్రి లక్ష్మీ నరసింహా స్వామి గుడి ఆవరణంలో పూజలు చేసి , తర్వాత గుడి బయట సర్వమత ప్రార్థనలు చేయించేసి అప్పజెప్పాలని ఆలోచనతోనే కార్యక్రమం చేశామన్నారు. అందులో భాగంగా మొదటిగా స్వామి పూజ చేసిన తర్వాత గుడి బయట, గుడి ఆవరణంలో కాదు సర్వమత ప్రార్థనలు చేసినప్పుడు దానిపై చర్చకు తెరలేపినారు. ఇది ఒక ధార్మిక సంస్థను నొప్పించాలని ఉద్దేశంతో చేయాలా, ఏ ధర్మానికి వ్యతిరేకంగా ప్రవర్తించాలని ఆలోచనతో మేం చేయాలా. ఇది ఊరి కోసం, ఈ నియోజకవర్గం కోసం సమ కురుస్తున్నటువంటి వానలు.. దీంట్లో ఏ ఒక్క కులానికో మతానికో ఒకరికే అప్పచెప్పరని ఆలోచన రాకూడదని ఒక సస్పంకల్పంతో చేసిందే కానీ అన్యమత ప్రచారం చేయాలని గాని, అన్యమత ప్రచారం అక్కడ జరగలేదని అన్నారు. కేవలం నేను,ఎస్పీ అడిషనల్ ఎస్పీ ఈవో గుడిలో వెళ్లి పూజలు చేసుకొని రావడం జరిగింది. తర్వాత అర్చకులు కూడా బయటకు వచ్చేశారు. దయచేసి ఒక మంచి ఆలోచనతో చేసినటువంటి కార్యక్రమాల్ని మీరు అపార్థం చేసుకోవద్దని కోరుతున్నాని పేర్కొన్నారు. ఈ నియోజకవర్గంలో ఎప్పుడు కూడా ఎవరి పండగ జరిగిన అందరి పండగల్లో భాగస్వామ్యం పంచుకున్న టువంటి మనస్తత్వం కలిగిన వాళ్ళం మేము.. ప్రత్యేకించి వినాయక చవితి కావచ్చు ఇతరత్రా నరసింహస్వామి ఉత్సవాలలో కావచ్చు సంతోషంగా భాగస్వామ్యం పంచుకున్నటువంటి వ్యక్తులు మేము అని అన్నారు. ఎవరినో ఒక వర్గాన్ని కించపరచాలని ఆలోచన మాకు ఎప్పుడు ఉండదు, రాజకీయం చేయాలని ఆలోచన కూడా మాకు లేదు.. ఇప్పుడు ఏమి నాకు ఎన్నికలు లేవు, ఎన్నికల కోసం చేసింది కాదు, కాబట్టి నొప్పి పడి కొంతమంది మధ్యకాలంలో సోషల్ మీడియా వేదికగా చేస్తున్నటువంటి ఆలోచనలు గాని, వ్యాఖ్యానాలకు గాని ముగింపు పలకాలని ఉద్దేశంతో మాట్లాడుతున్నానని పేర్కొన్నారు. బహుశా భవిష్యత్తులో మిమ్మల్ని ఎవరినైనా నొప్పించేటువంటి కార్యక్రమం ఈ కార్యక్రమలు చేయను అని చెప్పడం లేదు, కార్యక్రమాలు చేయాల్సివస్తే సర్వమత ప్రార్థనలు అనేటివి ప్రజా జీవితంలో ఒక భాగస్వామ్యం ఉంటుందన్నారు. నిర్వహించాల్సి వస్తే మీరు ఎక్కడైతే నొప్పి పడ్డారో ఆ రకంగా మిమ్మల్ని భవిష్యత్తులో నొప్పించేటటువంటి కార్యక్రమాలు చేయనని తెలియచెప్తున్నాం.

మిమ్మల్ని ఎవరిని నొప్పించే పరిస్థితి గానీ కించపరిచే పరిస్థితి గానీ , ఏ ఒక్క మతాన్నీ ధర్మాన్ని తప్పుగా చూపించే ప్రయత్నం గానీ భావోద్వేగాలు రెచ్చగొట్టేటటువంటి ఆలోచన మాకు లేదని మన స్ఫూర్తిగా తెలియచెప్తున్నామన్నారు. భవిష్యత్తులో పునరావృతం కాకుండా అందరూ సంతోషంగా కలిసి మెలిసి బ్రతికే రకంగా ఉండేటటువంటి విధానంలోనే బ్రతుకుతామని స్పష్టం చేశారు.

# ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు

- ఎస్ఐ తిరుపాల్ నాయక్




**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై తిరుపాల్ నాయక్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోనీ పలుచోట్ల ట్రాఫిక్ నిభందనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపాల్ నాయక్ మాట్లా డుతూ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, అందుకు అనుగుణంగా నడుచు కోవాలన్నారు. మద్యం సేవించి నడపడం, మైనర్ లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. వీటి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు వచ్చే సందర్భాల్లో వాహన పత్రాలు, తమ లైసెన్స్ కలిగి ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## బంగారం, నగదు, వెండి
# దోచుకెళ్లిన దుండగులు



**కనేకల్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 27 :** కనేకల్లు మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఎదురుగా గల అబ్దుల్ లతీఫ్ ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు వెండి నగదు దోసెకెళ్ళిన దుండగులు. ఇంటి యజమాని లతీఫ్ వాళ్ళ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గత రెండు రోజుల క్రితం లతీఫ్ భార్య చిన్నాయన వజ్రకరూరులో మరణించడంతో చూడడానికి వెళ్లి అలాగే హైదరాబాద్ కి వెళ్ళమని తెలిపారు. తిరిగి వచ్చేసరికి ముందు తలుపులు తీయగా వెనక తలుపులు పగలగొట్టి చోరీ జరిగినట్లు గుర్తించామని తెలిపారు. బంగారు వెండి నగదు ఇంటి పట్టా మరియు పాస్ పుస్తకం దొంగలు దోచుకెళ్ళినట్లు వారు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని సీఐ వెంకటరమణ ఇంచార్జ్ ఎస్సై నబిరసూల్ పరిశీలించి డాగ్స్ స్క్వాడ్ రప్పించి విచారణ మమరం చేపట్టారు. ఇది స్థానికుల పనేనని అనుమానిస్తున్నట్లు వారు తెలిపారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, డిసిఎంఎస్ చైర్మన్‌లు



**ప్యాపిలి - సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండలలోని నల్ల మేకలపల్లి గ్రామంలో సచివాలయంకు, ప్యాపిలిలో కస్తూర్బా బాలికల పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి శనివారం రోజున డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే, కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్, వై నాగేశ్వరరావు యాదవ్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆహ్వానం

**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 27 :** పవిత్రమైన పాపాగ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం నందు జరుగు వైకుంఠ ఏకాదశి సందర్భంగా నియోజకవర్గ టిడిపి ఇంచార్జి బీటెక్ రవిని, వేంపల్లి మండల పరిశీల కుడు అంజుగట్టు రఘునాథ్ రెడ్డి, మా రెడ్డి జోగిరెడ్డి, డైరెక్టర్ శశిభూషణ్ రెడ్డి లను వేంపల్లి ఆలయ పాలకమండలి చైర్మన్ పీవీ.రమణ, అర్చకుడు హరిప్రవీణ్, సునీల్ కుమార్ లు శని వారం కలిసి వారిని ఆహ్వానించారు. ఈ నెల 30న జరిగే ఈ వైకుంఠ ఏకాదశికి తప్పు కుండా విచ్చేసి దైవదర్శనం చేసు కోవాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు..



# గండి క్షేత్రం నిత్య అన్నదాన పథకానికి విరాళాలు



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** రాయలసీమ జిల్లాలలోనే ప్రసిద్ధి చెందిన గండి క్షేత్రం శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో ప్రతిరోజు జరుగు శాశ్వత నిత్య అన్నదానము పథకానికి లింగాల శివ సాయి రెడ్డి వీరి ధర్మపత్ని సే రెడ్డి జోత్స్నా వీరి కుమారుడు శివ మాన్విక్ రెడ్డి, కత్తులూరు గ్రామం, పోస్ట్, వేంపల్లి మండలం, వైయస్సార్ కడప జిల్లా వాస్తవ్యులు రూ.50116, వైసీఆర్ అజయ్ కౌశిక్ వీరి ధర్మపత్ని ఆదిలక్ష్మి వీరి కుమార్తె వసంతలు హైదరాబాద్ వాస్తవ్యులు రూ.50116 శ్రీ స్వామివారి నిత్య అన్నదానము అకౌంట్ నకు ఈ ఇరువురు దాతలు ఆన్‌లైన్ ద్వారా విరాళాలు ఇచ్చారని ఆలయ సహాయ కమీషనర్ జె.వెంకట సుబ్బయ్య తెలిపారు. అనంతరం వీరికి ఆలయ ప్రధాన అర్చకులు వి.కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు వి.రాజ స్వామి, మాజీ చైర్మన్ కల్లూరి వెంకటస్వామి శ్రీ స్వామివారి ప్రత్యేక దర్శనము చేయించి వేదమంత్రములతో శేష వస్త్రములు ఇచ్చి స్వామివారి తీర్థ ప్రసాదములను అందజేశారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో
# బాలల సంరక్షణకు ప్రాధాన్యం

- సూపర్వైజర్ జయశ్రీ




**కదిరి - సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** అంగన్వాడి కేంద్రంలో బాలల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఉందని ఐసిడిఎస్ కుమ్మరవాండ్లపల్లి సెక్టర్ సూపర్వైజర్ డి జయశ్రీ పేర్కొన్నారు. శనివారం కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి లోని అంగన్వాడి కేంద్రం 1 3 కేంద్రాలలో ఈసీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతినెల నాలుగో శనివారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని కుమ్మరవాండ్లపల్లిలో నిర్వహించినట్లు సూపర్వైజర్ తెలిపారు జీరో టు 5 సంవత్సరాల పిల్లలను వారి తల్లిదండ్రులు అంగన్వాడీ కేంద్రాలకు పంపించి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. చిన్న పిల్లలు భవిష్య త్తులో ఉన్నత విద్యను అభ్యసించాలంటే చిన్న వయసులోనే ఆటలు పాటలతో పాటు చదువు పైన కూడా మక్కువ చూపించాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని అన్నారు గ్రామాలలో బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించడానికి గ్రామస్తులు పూర్తి స్థాయిలో తమకు సహకరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. అంతేకా కుండా అంగన్వాడి కేంద్రాలకు వచ్చే చిన్న పిల్లలకు ప్రభుత్వ నుంచి రావాల్సిన సౌకర్యాలని అందుతాయని వివరించారు అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి వర్కర్ హెల్పర్ చిన్నపిల్లలకు ఆటపాటలతో పాటు విద్యను కూడా నేర్పిస్తారని ఈ అవకాశాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో అంగన్వాడి టీచర్లు సువర్ణ లక్ష్మి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# టీడీపీ పార్లమెంట్ సెక్రటరీగా పి.సుభాన్ బి ఎన్నిక

- ఎమ్మెల్యే కెఈ.శ్యాంబాబుకు ధన్యవాదాలు తెలియజేసిన చేసిన టిడిపి మహిళలు



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 27 :** కర్నూలు జిల్లా టీడీపీ పార్లమెంటు సెక్రె టరీగా పత్తికొండ పట్టణానికి చెందిన ముస్లిం మహిళ పి.సుభాన్బీ ఎన్నిక కావడం హర్షించదగ్గ విషయమని టిడిపి మహిళలు అన్నారు.శనివారం పిల్లికండ్ల సుభాన్ బి విలేకరుల సమావేశం నిర్వహించి వారు మాట్లాడుతూ 2024 స్థానిక అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన సందర్భంగా నన్ను పత్తికొండ ఎమ్మెల్యే కేఈ.శ్యాంబాబు గుర్తించడం వలనే పదవి లభించిందని అన్నారు.నాపై నమ్మకం వచ్చి పదవిని కట్టబెట్టిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్,పత్తికొండ ఎమ్మెల్యే కె.ఈ శ్యాంబాబు లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. రాబోయే స్థానిక ఎన్నికలలో కూడా పార్టీ బలపేతం కొరకు కష్టపడి పార్టీ మహిళలను కలుపుకొని పనిచేస్తానని అన్నారు.అంతేకాకుండా పత్తికొండ నియోజకవర్గం మహిళ నాయకురాలైన ఈరమ్మకు జిల్లా టీడీపీ నాయకులకు మహిళలకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు

# విద్యార్థులు సృజనాత్మక శక్తిని మెరుగుపరుచుకోవాలి






**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** విద్యార్థులు సృజనాత్మక శక్తిని మెరుగుపరచుకోవాలి అని గ్లోబల్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ ద్రాక్షాయని అన్నారు. శనివారం స్థానిక గ్లోబల్ పబ్లిక్ స్కూల్లో ప్రొఫెషనల్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో ఇలాంటి వినూత్న మైన కార్యక్రమాలు నిర్వహించడం వలన విద్యార్థులలో రెట్టింపు ఉత్సాహాన్ని నింపు తాయన్నారు. చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకత స్వయం శక్తిని పెంపొం దించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వికాసం లాంటి వివిధ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. అనంతరం విద్యార్థు లచే నిర్వహించినటువంటి వృత్తి నైపుణ్య వేషధారణలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయులు బోధ నేతల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## వంద కోట్ల బడ్జెట్ సమావేశం కేవలం కొద్ది నిమిషాల్లో

# ముగించడంలో ఆంతర్యం ఏమిటి?

**- ఇర్ఫాన్ బాషా సవాల్**

**ప్రొద్దుటూరు– సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్‌లో నేడు నిర్వహించిన వంద కోట్ల రూపాయల బడ్జెట్ సమావేశం ప్రజాస్వామ్యానికి నేరుగా సవాల్ చేసినట్టుగా మారిందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఇర్ఫాన్ భాష తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.. వంద కోట్ల రూపాయలతో కూడిన కీలక బడ్జెట్ సమావేశాన్ని కేవలం కొద్ది నిమిషాల్లోనే ముగించడం వెనుక భారీ ఆంతర్యం ఉందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఇర్ఫాన్ భాష తీవ్రంగా విమర్శించారు. పదిన్నరకు షెడ్యూల్ చేసిన ఈ సమావేశంలో ఛైర్‌పర్సన్ సభలో కూర్చున్న వెంటనే బడ్జెట్ ఆమోదమైందని ప్రకటించి సమావేశాన్ని ముగించడం ప్రజా స్వామ్య విలువలకు తూట్లు పొడిచినట్టేనని అన్నారు. మున్సిపాలిటీ ఆదాయాలు, వ్యయాలు, నిధుల వినియోగం, నిల్వలు, రాబడులు వంటి అంశాలపై సభలో విస్తృత చర్చ జరగాల్సి ఉండగా కేవలం కొద్దిమంది సభ్యులతో హుటాహుటిన నిర్ణయం తీసుకోవడం ఏ రాజ్యాంగ హక్కుతో జరిగిందని ఇర్ఫాన్ భాష ప్రశ్నించారు. మున్సిపాలిటీ ప్రజాధనం కుటుంబ ఆస్తిలా భావిస్తూ మున్సిపాలిటీని "కుటుంబ వ్యాపారం"గా మార్చారని తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార పార్టీ ఇటు ప్రతిపక్షం ఇరువురు కూడా నామమాత్రంగా మౌనం పాటిస్తూ ఈ ప్రజావ్యతిరేక నిర్ణయాలకు మద్దతుగా నిలుస్తున్నారని మండిపడ్డారు. ప్రొద్దుటూరు పట్టణ అభివృద్ధిపై, పురపాలక సంఘ నిధులపై చిత్తశుద్ధి ఉంటే వంద కోట్ల బడ్జెట్‌ను కొద్ది నిమిషాల్లో ఎలా ఆమోదిస్తారని నిలదీశారు.



అలాగే, పెట్రోల్ బంక్ వ్యవహారంలో అవినీతి జరిగిందని సాక్షాత్తు కమిషనర్ నిర్ధారించినప్పటికి 2022 నుంచి ఇప్పటి వరకు జరిగిన క్రెడిట్ కార్డుల కమిషన్లపై ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. నేడు సమావేశం నామమాత్రపుగా జరగడం వెనుక ప్రజల దృష్టిని మళ్లించాలనే రాజకీయ దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రొద్దుటూరు ప్రజలకు సమాధానం చెప్పే ధైర్యం లేకే ఇలా నిమిషాల్లోనే సభను ముగించారని ఆరోపించారు. ఇలాంటి ప్రజావ్యతిరేక నిర్ణయా లను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అవసరమైతే ఉద్యమాలకు కూడా సిద్ధమని ఇర్ఫాన్ భాష హెచ్చరించారు. వంద కోట్ల బడ్జెట్ సమావేశాన్ని కొద్ది నిమిషాల్లో ముగించడం ప్రజాస్వామ్యానికి అవమానమని, ప్రొద్దుటూరు ప్రజలు దీనికి తగిన సమాధానం కోరుతున్నారని ఆయన స్పష్టం చేశారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్...!

**- రూ. 70 లక్షల విలువైన బంగారు ఆభరణాలు,**
**7 కిలోల వెండి, రూ.లక్ష స్వాధీనం..**

**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** అనంత్‌పురం పోలీసులు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.70 లక్షల విలువైన బంగారు ఆభరణాలను, 7 కిలోల వెండిని మరియు రూ.1 లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోని బళ్ళారికి చెందిన యాదవల్లి మంజు, పి. రామదాసు అనే ఇద్దరు నిందితులు పగలు రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడేవారని పోలీసులు తెలిపారు. వీరిద్దరికి సంబంధించిన 9 పెండింగ్‌లో ఉన్న దోపిడీ, చైన్ స్నాచింగ్‌లు మరియు దొంగతనాల కేసులను కూడా పోలీసులు ఛేదించారు, అయితే వారిపై గతంలో కర్ణాటకలోని బళ్లారి జిల్లా మరియు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో ఆరు కేసులు నమోదయ్యాయి.





అనంతపురం ఎస్పీ పి.జగదీష్ మీడియాతో మాట్లాడుతూ..... నిందితులు గదర్ నగర్‌కు చెందిన యడవల్లి మంజు, కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా సిద్దరగడ్డకు చెందిన పి.రామదాస్ అని తెలిపారు. సన్నిహిత మిత్రులైన వీరిద్దరూ మద్యం, జూదం, క్రికెట్ బెట్టింగ్‌లకు బానిసలై భారీగా అప్పులు చేశారు. వారి అప్పులను తీర్చడానికి మరియు విలాసవంతమైన జీవనశైలిని నడిపించడానికి, వారు ఒంటరిగా నడుస్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని, పట్టణాల్లోని అంతర్గత భాగాలలో ఇళ్లకు తాళాలు వేసి నేరాలకు పాల్పడ్డారు. వీరిద్దరూ పగటిపూట నిఘా పెట్టి రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడ్డారని వీరు గత కొన్ని రోజులుగా అనంతపురం, గూత్తి, తాడిపత్రి, కసాపురం, డి.హీరేహాళ్, పరిసర ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్పడ్డారు. గతంలో బళ్లారి, గుంటూరులో అరెస్టయినా, బెయిల్ రావడంతో మళ్లీ నేర కార్యకలాపాలకు పాల్పడ్డారు. వరుస ఘటనల నేపథ్యంలో ఎస్పీ త్రీటౌన్, సీసీఎస్ పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. చోరీకి గురైన బంగారం, వెండిని విక్రయించేందుకు యత్నిస్తున్న మంజు, రామదాసులను అనంతపురంలోని బళ్లారి రోడ్ సర్కిల్ సమీపంలో పోలీసులు పట్టుకొని నిందితుల నుంచి రూ.70 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఏడు కిలోల వెండి ఆభరణాలు, రూ.లక్ష నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## రోగులకు ఆర్థిక భారం తగ్గించే

# ఉచిత భోజన పథకం అమలు

**- సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మూడు పూటల భోజనానికి శ్రీకారం**
**- ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ**

**పెళ్లకూరు–సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద ప్రజలకు భోజన ఖర్చుల భారం లేకుండా చేసి, పౌష్టికాహారం ద్వారా వారు త్వరగా కోలుకునేలా చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత భోజన పథకానికి సూళ్లూరుపేటలో ఘనంగా శ్రీకారం చుట్టారు. శనివారం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మూడు పూటల ఉచిత భోజన సదుపాయాన్ని సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, సముదాయ ఆరోగ్య కేంద్రాల్లో చేరిన ప్రతి రోగికి రోజూ మూడు పూటలా ఉచితంగా భోజనం అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా పేద రోగులపై ఆర్థిక భారం తగ్గడంతో పాటు, సరైన పౌష్టికాహారం అందడం వల్ల ఆరోగ్యంగా కోలుకునే అవకాశం మరింత మెరుగవుతుందని పేర్కొన్నారు.





ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవం జరిగిన మాతృమూ ర్తులకు మూడు రోజుల పాటు ప్రత్యేకంగా సిద్ధం చేసిన పౌష్టికాహారం ఉచితంగా అందించనున్నట్లు ఆమె తెలిపారు. అలాగే రోగుల ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యుల సూచనల మేరకు అవసరమైన ప్రత్యేక ఆహారాన్ని కూడా అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఆసుపత్రుల్లో రోగులకు అందించే భోజనం నాణ్యంగా, శుభ్రంగా ఉండేలా పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ఉచిత భోజన పథకం రోగులకు ఎంతో ఉపయుక్తమని పేర్కొన్న ఎమ్మెల్యే, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. ఆరోగ్యవంతమైన సూళ్లూరుపేట నిర్మాణంలో ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ చర్యలకు ప్రజల సహకారం అవసరమని ఆమె తెలిపారు.



## జబీవుల్లా సేవకు తగిన పదవి



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం, డిసెంబర్ 27 :** ప్రొద్దుటూరు మున్సిపల్ ఇన్చార్జి మాజీ ఛైర్మన్ జబివుల్లా తెలుగు దేశం పార్టీ కి చేసిన సేవలకు గుర్తింపుగా జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చి తగిన గౌరవం లభించిందని టిడిపి కడప జిల్లా ఉపాధ్యక్షుడు నజీముద్దీన్ తెలిపారు. శనివారం హైదర్ ఖాన్ వీధిలోని జబీవుల్లా కార్యాలయంలో కడప జిల్లా ఉపాధ్యక్షుడు మరియు మైనార్టీ నాయ కులు జబీవుల్లా ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జబివుల్లాని తన కార్యాలయంలో ఘనంగా సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. మైనార్టీ నాయకులను అభిమానించే తెలుగుదేశం పార్టీ మైనార్టీలకు తగిన గుర్తింపు ఇచ్చిందని హర్షం వ్యక్తం చేశారు.

## రైతుల సౌకర్యార్థం ఏఎంసీ పరిధిలో లింక్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

**- ఉయ్యాల ప్రవీణ్**

**నాయుడుపేట– సూర్య వాస్తవం, డిసెంబర్ 27:** నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) పరిధిలో లింక్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, ఏఎంసీ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సిహెచ్ రామాంజనేయులకు ప్రతిపాదనలు సమర్పించారు. శనివారం చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన సెక్రటరీల సమావేశంలో రీజనల్ జాయింట్ డైరెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో లింక్ రోడ్ల నిర్మాణం ద్వారా మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించుకునే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. దీని వల్ల రైతుల ఆదాయం పెరుగుతుందని వివరించారు. అనంతరం లింక్ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలను రీజనల్ జాయింట్ డైరెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఏఎంసీ సెక్రటరీ ప్రసాద్ రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## హౌసింగ్ ఫర్ ఆల్ దరఖాస్తుల విచారణ ప్రారంభం



**కనేకల్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 27 :** కనేకల్‌లో పేదల సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో అమలు చేస్తున్న హౌసింగ్ ఫర్ ఆల్ పథకం కింద కనేకల్ గ్రామంలో ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులపై విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు గ్రామ రెవెన్యూ అధికారులు శుక్రవారం నుంచి క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టారు. ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారుల కుటుంబ పరిస్థితి, ఆదాయ స్థాయి, ఇప్పటికే నివాస స్థలం ఉన్నదా లేదా, ఇల్లు ఉన్నదీ లేనిదీ వంటి అంశాలను అధికారులు సవివరంగా పరిశీలిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అర్హత ప్రమాణాల మేరకు మాత్రమే లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. విచారణ పూర్తైన అనంతరం అర్హుల జాబితాను సిద్ధం చేసి, ఇంటి స్థలాల మంజూరు అంశంపై పై అధికారులకు నివే దిక సమర్పించనున్నట్లు గ్రామ రెవెన్యూ అధికారి పవన్ కుమార్ శనివారం తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక లబ్ధిదారులకు అధి కారికంగా సమాచారం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంతో పేద కుటుంబాల్లో ఆశలు చిగురించగా, త్వరలోనే ఇంటి స్థలాల మంజూరు జరిగి సొంతింటి కలనెరవేరుతుందనే నమ్మకాన్ని కనేకల్ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేపడు తున్న సంక్షేమ పథకాలు అర్హుల వరకు చేరేలా అధికారులు పారదర్శకంగా చర్యలు తీసుకుంటున్నారని గ్రామప్రజలు అభిప్రాయపడ్డారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )